

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 169 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 16, మే 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




**అందాల పోటీలకు 200 కోట్లు ఖర్చు**

# సుపరిపాలనలో సుందరీమణులు

**అందల మెక్కిన అందాల పోటీలు**

- సుందరీమణుల పర్యవేక్షణలో భాగంగా చిన్న వ్యాపారస్తుల దుకాణాలు కూల్చివేత
- సుందరీమణుల కోసం భద్రత బలగాల రక్షణ నిరీక్షణలు
- కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు ప్రజా సొమ్మును ఇష్టారాజ్యంగా ఖర్చు చేయడం
- తెలంగాణ సంప్రదాయాలు హైదరాబాదుకే పరిమితమైతే సరిపోతుందా
- ఇతర దేశస్తులను ఆకర్షించుకోవడం కోసమేనా ఈ అందాల పోటీలు
- సుందరిమణుల సందర్శనాలంటూ అందాల పోటీలను ఎటుమళ్లిస్తున్నారు
- ప్రజా పాలనలో దారి తప్పుతున్న సాంప్రదాయాలు
- సాంప్రదాయాల పేరు మీద నిశ్శబ్దంగా అణిచివేస్తున్నారు : డాక్టర్ బరిగెల శివ



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

అంతరించిపోతున్న మానవ విలువల మధ్య అందాల పోటీలు నిర్వహించడం భలే గమ్మతిగా ఉందని డాక్టర్ బరిగెల శివ తన ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచారు.సొంత ప్రజల దైవదర్శనాలకు రక్షణ లేదు గాని సుందరిమానుల పలు జిల్లాలోని దైవదర్శనార్థం క్షేత్రస్థాయిలో భద్రత ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నారన్నారు. అక్కడక్కడ రోడ్ల పక్కన చిన్న చిన్న దుకాణాలు పెట్టుకొని, బండ్ల కొట్టులు పెట్టుకొని,వ్యాపారాలు నడుపుకుంటూ జీవనాల గడుపుతున్న సామాన్యుల షెడ్డులను పూర్తిగా తొలగించి, కూల్చివేయడమే కాకుండా వాళ్ళ జీవన మనుగడపై పూర్తిగా దెబ్బతీశారన్నారు.ఇది కూడా ప్రజా పాలనలోని భాగమేనా అని సూటిగా అడిగారు.అరటాల కోసం ఆర్భాటాల కోసం ప్రజా సొమ్మును ప్రభుత్వాలు వృధాగా ఖర్చు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న ప్రజా పాలన అభివృద్ధి అంతంత మాత్రమే కొనసాగుతుందన్నారు.సభలు సమావేశాలు

- మిగతా 2లో..



**డాక్టర్ బరిగెల శివ**

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




# అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

ఆ భయంతోనే కులగణనకు మోడీ అంగీకారం

బిహార్ పర్యటనలో రాహుల్ విమర్శలు

వివరాలు 2లో

# స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన

**కనిష్ట ధర 12..గరిష్ట ధర 75కు పెంపు**

**17వ తేదీనుంచి అమల్లోకి వస్తున్నట్లు ప్రకటన**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

మెట్రో రైలు ప్రయాణించే ప్రయాణికులకు ధరలవాత మొదలయ్యింది. ధరలను పెంచుతూ.. నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైలు ఛార్జీలు పెంచుతున్నట్లు- హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం ప్రకటించింది. ఇకపై మెట్రో రైలు టికెట్ ధర కనిష్టంగా రూ.12 కాగా.. గరిష్టంగా రూ.75గా పెరగనుంది. ప్రస్తుతం మెట్రో రైలులో టికెట్ కనిష్ట ధర రూ. 10.. గరిష్టంగా రూ.60గా ఉంది. ఈ పెంచిన ధరలు మే 17వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సులువుగా ప్రయాణికులను ఈ మెట్రో రైలు గమ్యస్థానాలకు చేరుస్తుంది. అటు ఎల్ బీ నగర్ నుంచి ఇటు మియాపూర్ వరకు.. అలాగే ఇటు నాగోలు నుంచి అటు రాయదుర్గం వరకు ప్రయాణించే ఈ మెట్రో రైలు నగరవాసులను అతి కొద్ది కాలంలోనే ఆకట్టు-కుంది. ప్రతి రోజు ఈ రైళ్లలో లక్షలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. నగరంలో భారీ వర్షం పడినప్పుడు.. ప్రయాణికులు ఈ మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే విశ్వ నగరం వేదికగా క్రికెట్ మ్యాచ్‌లు జరిగినప్పుడు.. మెట్రో ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. అయితే మెట్రో నష్టాల్లో నడుస్తున్న నేపథ్యంలో ఛార్జీల పెంపు ప్రతిపాదన గతంలోనే వచ్చింది. దీనిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో నాడు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై మెట్రో రైలు సంస్థ వెనకడుగు వేసింది. కానీ మెట్రో రైలు సేవల కారణంగా.. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు భారీ నష్టం వాటిల్లుతోంది. దీంతో ఛార్జీల పెంపు అనివార్యమైందని తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు- సమాచారం. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైలు భారీ నష్టాలతో నడుస్తుందని ఇప్పటికే ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మెట్రో ఛార్జీలు పెంపు అనివార్యమని స్పష్టం చేసింది. దీంతో మే 10వ తేదీ తర్వాత మెట్రో ఛార్జీలు పెంచుతామని ఇప్పటికే స్పష్టం చేసింది. అందులోభాగంగా మే 17వ తేదీ నుంచి ఈ ఛార్జీల పెంపు వర్తిస్తుందని ఆ సంస్థ వెల్లడించింది. ప్రభుత్వం అందిస్తున్న మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో రైలు నష్టాల బాటలో నడిచేందుకు ఇది ఒక కారణమని ఎల్ అండ్ టీ- సంస్థ ఇప్పటికే అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. అయినా మెట్రోలో ప్రయాణించందుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు.

# వీరయ్య చౌదరి హంతకులకు కఠిన శిక్ష

**కుటుంబ సభ్యులను పరామర్శించిన లోకేశ్**

**ఒంగోలు,జై భీమ్ న్యూస్**

ఇటీవల ఒంగోలులో దారుణ హత్యకు గురైన తెదేపా నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు- అడుగులు వేశారని, పార్టీ పటిష్టత కోసం కృషిచేసిన వీరయ్య చౌదరి దారుణహత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని మాజీ ఎంపీపీ నివాసానికి మంత్రి వెళ్లారు. వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటు-ంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ ఎంపీపీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా లోకేశ్ గుర్తు చేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో వీరయ్య చౌదరి తనతో పాటు- అడుగులు వేశారని లోకేశ్ తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన ఆయన దారుణహత్యకు గురవడం బాధాకరమని తెలిపారు. హత్య కేసు నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చేస్తామని అన్నారు. వీరయ్య చౌదరి కుటు-ంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటు-ందని భరోసా ఇచ్చారు. కుటు-ంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లోకేశ్ వెంట మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహా రెడ్డి, బీఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు ఉన్నారు



సమస్యలపై సమరంగా
జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

# సుపరిపాలనలో సుందరీమణులు









మొదటి పేజీ తరువాయి

అధికార పార్టీ కార్యక్రమాలు నాయకుల రవాణా ఖర్చులు మొత్తంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తము సొమ్మును శ్వేత పత్రంరూపంలో విడుదల చేయాలన్నారు.ఒకవైపు రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న నాయకులు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ప్రజా సమావేశాలకు,బహిరంగ సభలకు ప్రభుత్వ సొమ్మును విచ్చలవిడిగా ధారపోస్తున్నారన్నారు. అందాల పోటీల కోసం ప్రపంచంలోని అన్ని దేశాల నుండి తెలంగాణకు వచ్చిన అందాల సుందరిమణులను గౌరవించడంలో తప్పులేదు గాని తెలంగాణ రాష్ట్రం ఆచారాల పేరున సుందరిమణుల ఆచారాలను వాళ్ల వాళ్ల సంస్కృతిని ఏర్పడకుండా దెబ్బ కొడుతున్నారన్నారు.గ్రామస్థాయి ప్రజా పాలనను గాలికి వదిలేసి అందాల పోటీలు అంటూ హైదరాబాదులో హంగామాలు సృష్టిస్తున్నారన్నారు.ప్రజలు కష్టపడి ఇష్టపడి కాంగ్రెస్ పార్టీని బలపరిచి గెలిపించుకున్నది ప్రజలకు మేలు చేయడానికి గాని కీడు చేయడానికి కాదన్నారు.తెలంగాణలో సంస్కృతి సాంప్రదాయాల పేరున మతాల రహస్య మంతనాల పేరున రహస్య ఒప్పందాల పేరున వెలకట్టలేని అణిచివేత జరుగుతుందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం తరఫున ఎక్కడ కార్యక్రమాలు నిర్వహించిన గుంపులు గుంపులుగా వెళ్లడం ప్రభుత్వ ప్రజా సొమ్మును విపరీతంగా ఖర్చు చేయడం లాంటిది తెలంగాణలో అభివృద్ధి సంస్కృతిగా పేరుగాంచుతుందన్నారు.ఏ జిల్లాలో చూసిన నాయకుల తీరు పట్ల ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని హెచ్చరించారు.ఇతర దేశస్తులను ఆకట్టుకోవడం కోసమే అందాల పోటీలు నిర్వహిస్తే తెలంగాణ రాష్ట్రంలో లెక్కలేనంతమంది సుందరిమణులు రక్షణ లేమిలో జీవిస్తూ అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారన్నారు.పబ్బుల సంస్కృతి క్లబ్బుల సంస్కృతి రిసార్టుల సంస్కృతి ఓయోల సంస్కృతి విపరీతంగా పెరిగిపోయిన తెలంగాణ రాష్ట్రంలో అందాల సుందరిమణులు పలు ప్రధాన ఆకర్షణీయమైన ప్రాంతాలను సందర్శించడం దేనికోసం అంటూ ఎలాంటి సాంప్రదాయాలను అభివృద్ధి చేస్తున్నారో ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు.రాష్ట్రంలో మహిళలకు పూర్తి భద్రత రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.కాలం గడుస్తున్నప్పటికిని ప్రజా పాలనలో అభివృద్ధిలో మాత్రం వేగం పెరగడం లేదన్నారు. ఏ ప్రభుత్వం ఏర్పడిన హైదరాబాద్ పై చూపిస్తున్న మక్కువ ఇతర ఏ జిల్లాలో చూపించడం లేదన్నారు.రాష్ట్ర రాజధాని 30 సంవత్సరాల క్రితమే అభివృద్ధి చెందిందని దానిని నూతనంగా రంగులు వేయడానికి లక్షల కోట్ల రూపాయలు కాంట్రాక్ట్ రూపంలో దుబారాగా ఖర్చు చేస్తున్నారన్నారు.ప్రభుత్వాలు ప్రజలను పాలించడం కేవలం ప్రజా సంక్షేమ అభివృద్ధి కోసమే అనేది నేటి దినాల్లో ఎక్కడా కనిపించడం లేదన్నారు.సుందరీమణుల సందర్శనాలంటూ అందాల పోటీలను ఎటు మళ్లిస్తున్నారు అర్థం కావడం లేదన్నారు.ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారా ప్రజాస్వామ్యానికి లోబడి పరిపాలన చేస్తున్నారా ప్రజా పాలన పాలిస్తున్న నాయకులకే వదిలేయాలన్నారు.నిండు సభ లాంటి అసెంబ్లీలో ప్రజా పాలనపై ప్రభుత్వ నాయకులు ప్రమాణాలు చేసింది ఏంటి నేడు ప్రజాసేవ కోసం ముందుకు సాగుతున్నది ఏంటని సూటిగా ప్రశ్నించారు.తెలంగాణలోనే లెక్క లేనంత మంది సుందరిమణులు కలరని వారికి కనీస రక్షణ, కనీస భద్రత కల్పిస్తే చాలు అన్నారు.ఆడవాళ్లు జీవించాలంటేనే భయానాది భయంకరమైన రోజుల్లో బతకాల్సిన పరిస్థితిలు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డాయన్నారు.ఓటు రాజకీయాల కోసం ఇంత ఆరాటమా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారని తెలిపారు.ఎటు పోతుంది ఈ ప్రజా పాలన అంటూ సూటిగా నిలదీశారు.ప్రజాస్వామ్య విలువలను పలుకుబడి కలిగినోళ్ల పక్కన చేరుస్తూ అదే పరిపాలన అనుకొని నాయకులంతా సంబరపడిపోతున్నారన్నారు. నమ్మిన వాళ్లను నట్టేట ముంచి నమ్మకద్రోహం చేసినోళ్లను మెచ్చుకొని పక్కన పెట్టుకుంటున్నారన్నారు.తెలంగాణలో సుపరిపాలన కొనసాగిస్తున్నామంటూ పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తున్న ప్రభుత్వ నాయకులకు ప్రపంచ స్థాయి అందాల పోటీలు నిర్వహించి ప్రజాపాలనగా ప్రచారాలు చేయడం ఏమాత్రం బాగాలేదన్నారు."ఈ" కార్ రేస్ పోటీలు నిర్వహిస్తే గత ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్ష సలహాలు సూచనలు లేకుండా అధికారికంగా 200 కోట్లు అనధికారికంగా లెక్కలేనంత సొమ్మును ఖర్చు చేసి ఇంతటి క్లిష్ట సమయంలో అందాల పోటీలు నిర్వహించాల్సిన అవసరం ఏమి ఏర్పడిందో ప్రజా పాలన నాయకులు అందరూ కలిసి ప్రజలకు జవాబు చెప్పాలి అన్నారు.ప్రజా పాలన నాయకులను మెచ్చుకోకపోతే మెడలు పట్టి నెట్టేస్తామనే తరహాలో నాయకులు వ్యవహరిస్తుండడం ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు.ప్రభుత్వానికి సానుకూలంగా మాట్లాడితే ఒకరకంగా వ్యతిరేకంగా మాట్లాడితే హింసాత్మకంగా పాలన కొనసాగిస్తుండడం యావత్ తెలంగాణ మూడున్నర కోట్ల ప్రజలు గమనిస్తున్నారని సంగతిని మర్చిపోవద్దన్నారు.దేశానికి దిక్సూచి లాంటి కాంగ్రెస్ పార్టీ భారతదేశం ముఖ చిత్రాన్ని దిశా నిర్దేశం చేస్తే నేడు భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రావాల్సి ఉండగా కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వాలు ప్రజలపై కొనసాగిస్తున్న అప్రజాస్వామికమైన ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజా అనిచివేత పట్ల కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పూర్తి విశ్వాసం, నమ్మకం, సన్నగిల్లుతుందన్నారు,ప్రజలు కోరిన పరిపాలనను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ప్రభుత్వ నాయకులపై ఉన్నప్పుడు ప్రజలకు వ్యతిరేకమైన పనులను కార్యక్రమాలుగా పెట్టుకొని అభివృద్ధి చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకోవడం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం తగదన్నారు. ఆకలితో అలమటిస్తున్న కుటుంబాలను పక్కనపెట్టి సుందరీమణుల సందడి సంబరాల్లో నవ్వుల పండుగలు చేసుకుంటున్నా కాంగ్రెస్ నాయకులను ఏ విధంగా పరిగణించాలో తెలంగాణ ప్రజలకే వదిలేయాలన్నారు.

## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

**ఆ భయంతోనే కులగణనకు మోడీ అంగీకారం**

**బిహార్ పర్యటనలో రాహుల్ విమర్శలు**

పాట్నా,జై భీమ్ న్యూస్

దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ- విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేవలం 5శాతం మంది ప్రజల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు ఈ ప్రభుత్వంలో స్థానం లేదని, కార్పొరేట్ వ్యక్తులకే మోదీ గవర్నమెంట్ వత్తాసు పలుకుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రైవేటు- కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ- ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ- గేటు- బయటే నా కారును నిలిపివేశారు. అయినా, నేను వెనకడుగు వేయలేదు. నడుచుకుంటూ సభా వేదిక మీదికి చేరుకున్నాను. బిహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోదీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోదీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసని రాహుల్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కాకుండా...అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు.

## అమెరికాలో ప్రమాదానికి గురైన పర్వతారోహకులు

**భారతీయ సంతతికి చెందిన వ్యక్తి మృతి**

న్యూయార్క్,జై భీమ్ న్యూస్

అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. పర్వతారోణణకు వెళ్లిన బృందంలో ముగ్గరు దుర్మరణం చెందారు. అందులో భారతీయ సంతతికి చెందిన ఒకరు ఉన్నట్లు గుర్తించారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని నార్త్ క్యాస్కేడ్స్ పర్వతారోహణకు వెళ్లిన ఓ బృందం ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనలో భారత సంతతికి చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలతో బయటపడిన మరో యువకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు- తెలిసింది. సియాటెల్‌లోని ప్రముఖ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న విష్ణు (48).. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి పర్వతారోహణ కోసం నార్త్ ఎర్లీ వింటర్స్ స్పియర్స్ ప్రాంతానికి వెళ్లారు. దిగే సమయంలో ప్రతికూల వాతావరణం ఎదురయ్యింది. ఈ క్రమంలో వారి యాంకర్ పాయింట్ అదుపుతప్పి 200 అడుగుల లోతులో పడిపోయారు. అందులో ప్రాణాలతో ఉన్న ఓ యువకుడు మాత్రం 64కి.మీ మేర నడిచి.. ఎట్టకేలకు సురక్షిత ప్రాంతానికి చేరుకొన్నాడు. ప్రమాద విషయాన్ని అధికారులకు వెల్లడించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. హెలికాప్టర్ సాయంతో మృతదేహాలను బయటకు తీసుకువచ్చినట్లు- సమాచారం. భారత్‌కు చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సియాటెల్‌లో స్థిరపడ్డారు. గ్రేటర్ సియాటెల్‌లో ఉన్న ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫ్లూక్ కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగానికి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ పేరుగాంచిన నిపుణుల్లో ఒకడిగా గుర్తింపు పొందడంతో పాటు స్థానికంగా నిర్వహించే కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరించేవారు.

## గుర్తు తెలియని ట్రైన్ నుండి జారీ పడిమధ్యప్రదేశ్ వాసి మృతి

వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్



ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో శివయల్ మారుస్కోయి(30) తండ్రి ఉమర్సింగ్ మారసుకోలే బోరి గ్రామం బాలేఘాట్ జిల్లా మధ్య ప్రదేశ్ రాష్ట్ర వాసి ఇతను గుర్తుతెలియని ట్రైన్ నుండి యాక్సిడెంట్లుగా జారిపడి కరెంటు పోలుకు గుద్దుకొని తల పలిగి 348/28 పై లైను ఎడమవైపు ఉప్పల్ రైల్వే స్టేషన్ చనిపోయాడు. ఇతను జేబులో వరంగల్ నుండి నాగపూర్ కి జనరల్ టికెట్ ఉన్నది. మూడు ఫోన్ నెంబర్లు గల చిట్టి దొరికిందని, వారి ఫోన్ నెంబర్లకు ఫోన్ చేయగా ఇతను మధ్యప్రదేశ చెందిన వాడని మేస్త్రి పని చేస్తాడు. ఇతను ఇంటికి పోతున్నాడని ఇతనికి పెళ్లి అయిందని ఒక పాప ఉన్నదని



తెలియజేశారు. ఇట్టి విషయం వారి కుటుంబ సభ్యులకు తెలియజేసి బాడీని వారి కుటుంబ సభ్యులు మధ్యప్రదేశ్ రాష్ట్రం నుండి వచ్చే వరకు ఎంజిఎం మార్చురీలో భద్రపరచడం జరిగింది. వివరాలకు వెంకట్ రెడ్డి రైల్వే హెడ్ కానిస్టేబుల్ సెల్ నం 8712658609 సంప్రదించాలని తెలిపారు.

## ఉరుగ్వే మాజీ అధ్యక్షుడు జోస్ ముజికా కన్నుమూత

ఒకప్పటి గెరిల్లా, ఉరుగ్వే మాజీ అధ్యక్షుడు జోస్ ముజికా (89) బుధవారం కన్ను మూశారు. ఆయన చేపట్టిన ప్రగతిశీల సంస్కరణలతో ఆయన దక్షిణ అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందారు. ముక్కుసూటిగా మాట్లాడే ముజికా చాలామందికి 'పీప్' అనే నిక్‌నేమ్‌తో సుపరిచితులు. ఆయన మరణ వార్తను అధ్యక్షుడు యమాండు ఓర్సి ఎక్స్‌లో పోస్టు చేశారు. పౌర హక్కులకు సంబంధించిన అంశాలపై ఉదారమైన వైఖరి ప్రదర్శించిన ముజికా గే వివాహాలకు, తొలి మాసాల్లో గర్భస్రావాలకు అనుమతిస్తూ చట్టాన్ని తీసుకువచ్చారు. కేథలిక్ లాటిన్ అమెరికాకు అప్పట్లో ఈ చర్యలు పెద్ద మార్పు. బ్రెజిల్, చిలీ, మెక్సికో దేశాల అధ్యక్షులతో సహా పలువురు ప్రాంతీయ నాయకులు ముజికా మృతికి సంతాపం తెలిపారు. ఆయన పాలనా తీరును ప్రశంసించారు. ఆయన ప్రజాస్వామ్యాన్ని సమర్థించారని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా వ్యాఖ్యానించారు.

## కేబినెట్‌లో భారతీయ కెనడియన్లకు కీలక శాఖలు

కెనడా ప్రధాని మార్క్ కార్నీ తన క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించారు. కొత్త కేబినెట్‌లో భారతీయ -కెనడియన్లు అనితా ఆనంద్, మణీందర్ సిద్ధూలు కీలకమైన మంత్రిత్వ శాఖలను పొందారు. మంగళవారం ప్రకటించిన కొత్త కేబినెట్‌లో అనితా ఆనంద్ విదేశాంగ మంత్రిగా, సిద్ధు అంతర్జాతీయ వాణిజ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు అనితా ఆనంద్ ఆవిష్కరణలు, సైన్స్ మరియు పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. గతంలో రక్షణ మంత్రి సహా పలు పదవులను నిర్వహించారు. ప్రస్తుతం పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మెలానీ జోలీ స్థానంలో ఆమె నియమితులయ్యారు. కెనడా విదేశాంగ మంత్రిగా నియమితులవడం తనకు గౌరవంగా ఉందని, కెనడియన్లకు సురక్షితమైన, న్యాయమైన దేశాన్ని అందించేందుకు ప్రధాని కార్నీ, తమ బృందంతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నానని అనితా ఆనంద్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్యమంత్రిగా నియమితులవడం జీవితకాల పురస్కారంగా భావిస్తున్నానని ప్రమాణస్వీకారం అనంతరం సిద్ధు ఎక్స్‌లోపేర్కొన్నారు. వాణిజ్యాన్ని వైవిధ్యపరచడానికి, కొత్త ప్రపంచ మార్కెట్లను చేరుకోవడంలో కెనడియన్ వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి, ఉపాధి కల్పనలో సహాయపడటానికి తనపై వుంచిన విశ్వాసానికి కృతజ్ఞుడినని పేర్కొన్నారు. ఏప్రిల్ చివరి వారంలో జరిగిన కెనడా ఎన్నికల్లో లిబరల్ పార్టీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ బాధ్యతలు చేపట్టారు. రెండు వారాల తర్వాత ఆయన కేబినెట్ పునర్వ్యవస్థీకరణను ప్రకటించారు.

## జైషే చీఫ్ మసూద్‌కు రూ.14కోట్ల ఎక్స్‌గ్రేషియా




పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో జైషే మహమ్మద్ సంస్థ చీఫ్ మసూద్ అజార్ కుటుంబ సభ్యులతోపాటు అతడి సన్నిహితులు మొత్తం 14 మంది మరణించారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత్ దాడుల్లో చనిపోయిన మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకుంది మృతులు ఒక్కొక్కరికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో జైషే మహమ్మద్ సంస్థ చీఫ్ మసూద్ అజార్‌కు రూ. 14 కోట్లు ఎక్స్‌గ్రేషియాగా ప్రభుత్వం తరఫున అందనుంది. మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడి చేసింది. ఈ దాడిలో దాదాపు 100 మందికిపైగా మరణించినట్లు భారత్ వెల్లడించింది. అయితే ఈ దాడిలో మసూద్ అజార్ సోదరుడు అబ్దుల్ రవుఫ్ అజార్‌తో పాటు అతని ఇద్దరు బావలు మరణించారు. అయితే ఈ అబ్దుల్ రవుఫ్ అజార్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా భారత్ గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం హైజాక్ పథక రచనలో ఇతడు కీలక సూత్రదారి.

## సంపాదకీయం

# ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు...

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి అంతర్జాతీయ సంబంధాల్లో వివాదాస్పద ప్రవర్తనలో ఇమిడి ఉంది. ట్రంప్ దౌత్య అతిక్రమణలు, అవమానకరమైన భాష, భారత్‌పాకిస్తాన్ వివాదంలో అనవసర జోక్యం, ధనిక దేశంగా లేదా సైనికశక్తి బలంగా ఉన్న దేశానికి ప్రపంచ పోలీసుగా వ్యవహరించే హక్కు ఉంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది. ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు తరచుగా అసభ్యత, అవమానం దిశగా దిగిజారుతుంటాయి. స్నేహితులు, శత్రువులు అనే విచక్షణ లేకుండా నిర్లక్ష్యంగా మాటలు మీరుతుంటారు. వాణిజ్య చర్చల్లో కెనడా, మెక్సికోలను అమెరికాను వాడుకునే దేశాలుగా పేర్కొన్నారు. సుంకాలతో బెదిరించి సన్నిహిత స్నేహ దేశాలతో సంబంధాలను దెబ్బతీశారు. యూరోపియన్ మిత్రదేశాలను అమెరికా సైనిక రక్షణపై ఆధారపడే ఉచిత సవారీదారులు అంటూ ఎగతాళి చేసి, నాటో దేశాలలో విశ్వాసాన్ని క్షీణింప జేశారు. ఆసియాలో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్- ఉన్‌ను లిటిల్ రాకెట్ మాన్ అని హేళన చేసి, తర్వాత పొగడ్తలకు దిగడం దక్షిణ కొరియా, జపాన్‌ను గందరగోళానికి గురిచేసింది. ఇటువంటి పరుషమైన భాష వారి సహకారాన్ని పెంపొందించకపోగా మిత్రదేశాలను దూరం చేసింది. ట్రంప్ వ్యక్తి గత అహంకారం అమెరికా నైతిక ప్రతిష్టను గౌరవాన్ని తగ్గిస్తుంది. ఎక్స్‌లోని పోస్టులు ట్రంప్‌ను హిందీ సినిమాలో విలన్‌తో పోల్చాయి. ఆయన భాష ప్రపంచ నాయకుడి హోదాకి తగని విధంగా ఉందని అనేక దేశాల విజ్ఞులు విమర్శించారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'అమెరికా గొప్పతనం' ట్రంప్ (పిచ్చోడి చేతిలో రాయిలా) తయారయింది. ఆయన నిలకడలేని మాటలు, ప్రవర్తన విదూషకుడిని తలపిస్తాయి. కశ్మీర్ విషయంలో ట్రంప్ అసంబద్ధ దౌత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్న ఆయన కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయగలనని, భారత ప్రధాని నరేంద్ర మోడీ తన సహాయం కోరారని పేర్కొన్నారు. భారత్ ప్రభుత్వం ఈ వాదనను ఖండించింది. ఇటీవల 2025 మేలో భారత్ ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్ ప్రతిస్పందనలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' లో రెండు దేశాలు తన జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. ఈ వాదన ఆయన పాత్రను అతిశయోక్తిగా ప్రజలు అనుకుంటున్నారు. ఆయన మాటలు ద్వైపాక్షిక చర్చల గతిశీలతను పట్టించుకోలేదు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అనే విషయం మరచి అసందర్భంగా మాట్లాడటం హద్దు మీరటమే. మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్థిరంగా ఏనాడో చెప్పింది. ఇప్పటికీ చెబుతోంది. ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తాను అనే అనవసర ప్రతిపాదన భారత్ సార్వభౌమాధికారాన్ని అగౌరవ పరిచినట్టే. ఆయన మాటలు పాకిస్తాన్‌కు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. 'ఎక్స్'లో నెటిజన్లు ట్రంప్ అతిగా జోక్యం చేసుకోవడాన్ని ఘాటుగా దుయ్యబట్టారు. కశ్మీర్ చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏదిపడితే అది మాట్లాడటం వదురుబోతు లక్షణంగా విమర్శించారు. ట్రంప్ జోక్యం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమే. భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటమే అవుతుంది. అమెరికా ఆర్థికంగా బలమైన దేశం కావచ్చు. అలాగే సైనికశక్తి కూడా గొప్పగా ఉండవచ్చు. అంతమాత్రం చేత ఇతర దేశాల అంతర్గత లేదా ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు, అధికారం ఆయనకు లేదు. అమెరికాకు ధనం, ఆయుధాలు, అణుబాంబులు ఉన్నంత మాత్రాన ట్రంప్‌కు ప్రపంచపై పోలీసు అధికారాన్ని ఇవ్వవు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో సార్వభౌమాధికారం గల దేశాల స్వయం పరిపాలనను గౌరవించమని చెబుతుంది. అన్ని సార్వభౌమత్వం గల దేశాలు సమానమే. చిన్నదేశం అయినా, పెద్దదేశం అయినా సమానం హోదాను కలిగి ఉంటాయి. కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే భారత్, పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించటం చెల్లదు. అమెరికా బలవంతపు వ్యూహాలు, చర్యలు ఉద్రిక్తతలను పరిష్కరించకపోగా మరింత పెంచుతాయి. దేశాల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను దూరం చేస్తాయి. అమెరికా పెద్దన్న నాయకత్వ హోదాపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ట్రంప్ సుంకాల విధానాలు దౌత్య నిబంధనలను లెక్కచేయని వైఖరిని చూపిస్తాయి. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్‌లపై సుంకాలు విధించడం లేదా బెదిరించడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలను రేకెత్తించారు. ఇతర దేశాలు అమెరికా మార్కెట్‌ను దోపిడీ చేస్తున్నాయని ఆయన అర్థం లేని ఆరోపణలు వర్తక, వాణిజ్యం పరస్పర ప్రయోజనాలను విస్మరిస్తుంది. మిత్ర దేశాలను శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది ఆర్థిక స్థిరత్వాన్ని భంగం చేస్తుంది, అమెరికా నమ్మకమైన భాగస్వామిగా ఉన్న ఖ్యాతిని దెబ్బతీస్తుంది. ట్రంప్ అమెరికా ఫస్ట్ విధానం అమెరికా యువతకు ఆకర్షణీయ నినాదంగా ఉన్నప్పటికీ, ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తుంది. పర్యావరణం సమతుల్యత, భద్రత వంటి అంశాల్లో నిధులు రద్దు చేసి, సభ్యత్వం, సహకారాన్ని అందించని ఆయన నిర్ణయాలు ప్రపంచ దేశాలను ఇబ్బందిపెడుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పగా చేస్తానని ట్రంప్ చెప్పడం మంచిదే. గొప్ప ఆదర్శమే అందరూ ఆ లక్ష్యాన్ని గౌరవిస్తారు. అయితే అందుకు అనుసరించే పద్ధతులు కూడా ఆదర్శంగా ఉండాలి. అంతేగానీ విధ్వారంగా ఉండకూడదు. ఆయన చర్యలు మిత్ర దేశాలను దూరం చేసుకొనే విధంగా ఉన్నాయి. ఆయన ప్రవర్తనతో అమెరికా కు శత్రువులను పెంచుతుంది. మిత్రదేశాలు మధ్య విభజన జరుగుతుంది. ట్రంప్ దౌత్యవైఫల్యాలు ఆయన ఆక్షేపణీయ మాటల నుండి వస్తున్నాయి. భారత్– పాకిస్తాన్ ద్వైపాక్షిక వివాదాల్లో అనవసర జోక్యం తగదు. ప్రపంచ నాయకత్వంపట్ల లోతైన అవగాహనను ఆయన పెంచుకోవాలి. కశ్మీర్ విషయంలో పూర్వచరిత్ర తెలియని ఆయన మాటలు అర్థం లేనివి. అమెరికా ఆర్థికశక్తి, ఆయుధ శక్తితోనే పెద్దరికం రాదు. ఆయన మాటలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా లేవు. ఆయన బలప్రదర్శన, ఒత్తిళు సమర్థనీయం కావు. ఆయన మాటలు దేశాల సార్వభౌమాధికారాన్ని అగౌరవపరిచాయి. సున్నితమైన భౌగోళిక సమస్యలను సంక్లిష్టం చేశాయి. ప్రపంచాన్ని శాసించే అధికారం కేవలం ధనం లేదా ఆయుధాలతో రాదు, పరస్పర గౌరవం, సహకారం, మర్యాద ద్వారా లభిస్తుంది. ట్రంప్ నిరంతరం ఈ లక్ష్యాలను, విలువలను దెబ్బ తీశారు. అమెరికా తన గౌరవాన్ని పునరుద్ధరించాలి అంటే, విభజన, ఆధిపత్య వైఖరిని వదిలి, పరస్పర గౌరవం, సమన్వయంతో కూడిన దౌత్యాన్ని అనుసరించాలి.



# ఆవిష్కరణల కాంతిలో విశ్వమానవ ప్రగతి

తూర్పున ఉదయించే కాంతి రేఖలు మనకు ప్రతీ రోజూ నవశకానికి స్వాగతం పలుకుతుంది. తూర్పు దిక్కున అరుణారుణ కాంతులు మెల్లగా వ్యాపిస్తుంటే, అది కేవలం ప్రకృతి రమణీయమైన దృశ్యం మాత్రమే కాదుబీ మానవజాతి అనంతమైన ప్రగతి పథానికి అది శుభసూచకం. కాంతి కేవలం ఒక భౌతిక దృగ్విషయం మాత్రమే కాదు. ఇది నూతన ఆలోచనలకు, ఊహలకు, సృజనాత్మక ఆవిష్కరణలకు ఊపిరినిచ్చే ఒక అక్షయ శక్తి. కాంతి, ఈ విశ్వంలోని ప్రాథమిక శక్తి, కేవలం మన కంటికి గోచరించే ప్రకాశం కాదు. ఇది శాస్త్ర, సాంకేతిక, వైద్య, వ్యవసాయ, సమాచార, పర్యావరణ రంగాలలో ఊహించని విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, పేదరికం, అసమానత్వం, ఆహార కొరత, వాతావరణ మార్పు వంటి పెను సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కాంతి ఆధారిత సాంకేతికతలు ఒక దిక్సూచిలా, ఒక ఆశాకిరణంలా పని చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం మే 16న జరుపుకునే అంతర్జాతీయ కాంతి దినోత్సవం మన జీవితాల్లో కాంతి ప్రాముఖ్యతను మరింత లోతుగా గుర్తుచేస్తుంది. 2025వ సంవత్సరం థీమ్ అయిన 'కాంతి, ఆవిష్కరణ, సమాజం' అనేది ఈ ప్రాముఖ్యతను మరింతగా విశదీకరిస్తుంది. కాంతి బహుముఖ ప్రజ్ఞను మన ముందుంచుతుంది. ఈ థీమ్ శాస్త్రీయ పరిశోధనల పురోగతి, సాంకేతిక ఆవిష్కరణల విశిష్టత, సమాజ సమగ్ర శ్రేయస్సును పెంపొందించడంలో కాంతి ఆధారిత సాంకేతికతల అనితరసాధ్యమైన పాత్రను నొక్కి చెబుతుంది. విభిన్న నేపథ్యాలు కలిగిన ప్రజలను %-% శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలను కాంతి శాస్త్రం, సాంకేతికత యునెస్కో లక్ష్యాలైన శాంతి, సమానత్వం, విద్యను ఎలా సాధించగలదో తెలిపే విభిన్న కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనమని స్ఫూర్తినిస్తుంది, ప్రోత్సహిస్తుంది. కేవలం ఒక శతాబ్దం క్రితం ఊహించలేని లేజర్ల ఆవిష్కరణ నుండి నేటి అత్యాధునిక క్వాంటమ్ టెక్నాలజీల వరకు, కాంతి శాస్త్రం మానవ మేధస్సు అద్భుతమైన విజయాలకు, పురోగతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ క్వాంటమ్ సైన్స్, టెక్నాలజీ సంవత్సరంతో కూడా అనుసంధానించబడి ఉండటం, ఈ అంశం సమకాలీన ప్రాముఖ్యతను మరింతగా చాటుతోంది. నేడు మానవ సమాజం అనేక సంక్లిష్టమైన, అంతర్లీన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల తీవ్రపరిణామాలు, ఆరోగ్య సంరక్షణలో అంతరాలు అసమానతలు, ప్రపంచవ్యాప్తంగా అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించడంలో ఉన్న అవరోధాలు కొన్ని ముఖ్యమైనవి. ఈ క్లిష్టమైన సవాళ్లను సమర్థవంతంగా స్థిరంగా అధిగమించడానికి కాంతి ఆధారిత ఆవిష్కరణలు ఒక శక్తివంతమైన సాధనంగా, ఒక ఆశాజనకమైన మార్గంగా ఆవిర్భవిస్తున్నాయి. శక్తిని మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేయడానికి వినియోగించడానికి నూతన, పర్యావరణ అనుకూల లైటింగ్ టెక్నాలజీలు నిరంతరం అభివృద్ధి చేయబడుతున్నాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం వంటి ప్రాథమిక రంగాలలో కాంతి ఆధారిత సాంకేతికతల అనువర్తనాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. వ్యవసాయ రంగంలో 'అగ్రి-ఫోటోనిక్స్' ద్వారా పంటల దిగుబడిని గణనీయంగా పెంచడం, నీటి వినియోగాన్ని హేతుబద్ధీకరించడం, హానికరమైన తెగుళ్ళను పర్యావరణ అనుకూల పద్ధతుల్లో నియంత్రించడం సాధ్యమవుతోంది. వైద్య రంగంలో, మరింత కచ్చితమైన రోగ నిర్ధారణ, చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. అత్యాధునిక ఇమేజింగ్ టెక్నిక్‌లు కచ్చితమైన లేజర్ ఆధారిత చికిత్సా విధానాలు వ్యాధులను మరింత ముందుగా మరింత కచ్చితంగా గుర్తించడానికి సమర్థవంతంగా నయం చేయడానికి సహాయపడుతున్నాయి. ఇది రోగుల వేగవంతమైన పునరుద్ధరణకు దోహదం చేస్తోంది. సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో, కాంతి వేగంతో అపారమైన సమాచారాన్ని క్షణాల్లో చేరవేసే ఆప్టికల్ ఫైబర్‌లు ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా అనుసంధానిస్తున్నాయి. విద్యారంగంలో కాంతి ఆధారిత సాంకేతికతలు బోధనా పద్ధతులను మరింత ఆకర్షణీయంగా, ఇంటరాక్టివ్‌గా తద్వారా



మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయి. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తున్నాయి.

ఈ స్ఫూర్తిదాయకమైన అంతర్జాతీయ కాంతి దినోత్సవం సందర్భంగా, కాంతి అపారమైన శక్తిని దాని ఆధారిత సాంకేతికతల విశిష్టమైన ప్రాముఖ్యతను మనమందరం గుర్తెరుగుదాం. ముఖ్యమైన ఆవిష్కరణలు కేవలం ఉన్నత స్థాయి శాస్త్రీయ ప్రయోగశాలలకు లేదా ప్రత్యేక పరిశోధనా సంస్థలకు మాత్రమే పరిమితం కాకూడదు. వాటి విస్తృత ప్రయోజనాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి వర్గానికి అందుబాటులోకి రావాలి. విద్య, ఆరోగ్య సంరక్షణ స్థిరమైన అభివృద్ధి వంటి కీలక రంగాలలో కాంతి ఆధారిత ఆవిష్కరణలను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా, మనం మరింత సమతా పూర్వకమైన, అభివృద్ధి చెందిన మానవీయ విలువలు కలిగిన సమాజాన్ని నిర్మించగలము. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు విధాన రూపకర్తలు ఒక ఉమ్మడి లక్ష్యంతో కలిసి పనిచేసి, కాంతిని మరింత సమర్థవంతంగా, సృజనాత్మకంగా ఉపయోగించుకునే మార్గాలను అన్వేషిద్దాం. తద్వారా, మనం ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించగలము. కాంతిని ఆవిష్కరణలకు మార్గదర్శకంగా, సమాజానికి వెలుగు దివ్వెగా నిలుపుదాం. ఈ కాంతి ప్రయాణంలో ప్రతి ఒక్కరి ఆలోచనలు, ప్రయత్నాలు భాగస్వామ్యం అమూల్యమైనవి. కలిసి సాగుదాం, కాంతివంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం.

# అలుపెరుగని పోరాట యోధుడు

యజుర్వేద శాఖీయులు అయిన పేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి వర్ధంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 - మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933-34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941-42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937-39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940-42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60- 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుంజయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు...వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940-42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 - 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు. "చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి. 1945-46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది. 1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరఫున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియో జకవర్గం అంతా తిరిగారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు. అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు. 1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్ళారు. 1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్ళారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు. సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం- గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది. పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు."మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం. అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంథాలయం ఏర్పడ్డాయి.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# వర్షాకాలానికి ముందే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి




జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా వర్షాలు పడక ముందే పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని గోదాంల వద్ద నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఇప్పుడు వరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో ఎన్ని మిల్లులు ట్యాగ్ అయి ఉన్నాయి, ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలకు డబ్బులు జమా అవుతున్నాయా, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఇంకా ఎన్ని గన్నీ బ్యాగులు ఉన్నాయి, ఒక్కో గన్ని బ్యాగుకు ఎంత ధర పడుతుందనే వివరాలను అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఇదే మండలంలోని వీర నారాయణపూర్ లో తొలి విడత మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ గ్రామానికి చెందిన లబ్ధిదారులు సౌందర్య, సుశీల ఇండ్ల నిర్మాణానికి మెటీరియల్సు ఎక్కడినుండి తీసుకు వస్తున్నారు, ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చయిందని, ఎప్పటి వరకు పూర్తి చేస్తారని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒకే రేటు ప్రకారం చేస్తున్నారా లేదా అని లబ్ధిదారులతో మాట్లాడి కలెక్టర్ తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు బేస్ మెంట్ లెవెల్ వచ్చాయని, ఆ దశకు వచ్చిన వాటిని బిల్లు చెల్లింపు కోసం ఆన్లైన్ చేస్తున్నారా, ఈ గ్రామంలో ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయని, ఇంకా మొదలుపెట్టని ఇండ్లను ఎప్పటినుండి ప్రారంభిస్తారని గృహ నిర్మాణ శాఖ డిఈ సిద్ధార్థ నాయక్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతోనూ జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మీడియాతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, జిల్లాలో ఇప్పటివరకు 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు దాదాపుగా 150 కోట్ల రూపాయలను చెల్లించినట్లు పేర్కొన్నారు. రెండు వారాలలో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా వీరనారాయణపూర్ లో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తిచేసి ఆన్లైన్ అయిన ఇండ్ల నిర్మాణాల లబ్ధిదారులకు బిల్లు చెల్లించడం జరిగిందన్నారు. వివిధ మహిళా వీవో గ్రూపుల ద్వారా లబ్ధిదారులు బేస్మెంట్ లెవెల్ పూర్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మిగతావి కూడా త్వరలో ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఇన్చార్జి జిల్లా అదనపు కలెక్టర్ మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఎంపీడీఓ విజయ్ కుమార్, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## దళితులపై దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలి

అంకేశ్వరపు రామ చందర్ రావు మాల మహానాడు గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు

వరంగల్ జై భీమ్ న్యూస్



మే నెల 12వ తేదీన బుద్ధ పూర్ణిమ రోజు నిర్మల్ జిల్లా ముధోల్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహాన్ని స్థాపించి బుద్ధ జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న బుద్ధిష్టులైన దళితుల పైన నిర్మల్ జిల్లా ముధోల్ గ్రామానికి చెందిన కొంతమంది దాడి చేసి దౌర్జన్యం చేసి గాయపరిచిన వారి పైన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ మాల మహానాడు అధ్యేక్షుడు అంకేశ్వరపు. రామ చందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని, ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బుద్ధుని అభిమానులు, బుద్ధిస్టులు అయిన దళితులకు ప్రభుత్వము అన్ని విధాల అండదండగా ఉండాలని, వారి కోరిక మేరకు ప్రభుత్వ భూమిలో బుద్ధుని విగ్రహం స్థాపించుటకు వారికి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముధోల్ గ్రామంలో గ్రామ ప్రజలను రెచ్చగొట్టి, ప్రజల మధ్యన కులమత విభేదాలు సృష్టిస్తున్న అరాచక శక్తుల పైన వెంటనే పోలీస్ యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి దళితులపై దాడి చేసిన వారి పైన వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష పలువురుకి జరిమాన



వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమీషనర్ సంప్రీత్ సింగ్ ఐపీస్, టీ. సత్యనారాయణ ఏసీపీ పర్యవేక్షణలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన (23) మంది వ్యక్తులను, గౌరవ మేజిస్ట్రేట్ అబ్బోజు. వేంకటేశం ఎదుట హాజరు పరచగా వద్దే కొటేశ్వర్ (58) తండ్రి వీరస్వామి, ఫోర్ట్ వరంగల్, వరంగల్, మొహమ్మద్ అస్లాం(28) తండ్రి అఫ్జల్ పాషా పోచంమైదాన్, వరంగల్, గట్ల శ్రీకాంత్ (28) రామదాసు ఎల్కతుర్తి, హన్మకొండ, జన్ను అరుణ్ (32) తండ్రి బాబు లేబర్ కాలనీ, వరంగల్, నల్ల విష్ణువర్ధన్ రెడ్డి (38) తండ్రి సమ్మి రెడ్డి, నయీమ్ నగర్, హన్మకొండ, మాదాసి సుధాకర్ (38) తండ్రి బాబు దేశాయిపేట, వరంగల్ లకు (2) రోజుల జైలుశిక్ష పడగా హుజురాబాద్ సబ్ జైలుకు పంపి, మిగత (17) మంది వ్యక్తులకు 18,900/-రూపాయల జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన (01) వ్యక్తులను కోర్టులో హాజరు పర్చగా వారికి 500/- రూపాయల జరిమానా ను విధించారని వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కే రామకృష్ణ తెలిపారు.

## హన్మకొండ కలెక్టర్ చేతుల మీదుగా మైనార్టీ గురుకుల అడ్మిషన్ పోస్టర్ ఆవిష్కరణ



హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం తాను కలెక్టరేట్లోని చాంబర్లో మైనార్టీ గురుకుల పాఠశాలల అడ్మిషన్లకు సంబంధించిన ప్రచార పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. హన్మకొండ జిల్లాలో మొత్తం మూడు బాలుర గురుకుల పాఠశాలలు, ఒక బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయని పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎండబ్ల్యూఓ మురళీధర్ రెడ్డి, ఆర్ఎల్సీ శ్రీనివాస్ తనుగుల, గురుకుల ప్రిన్సిపాళ్లు సతీష్, నీరజ, శిరీష పాల్గొన్నారు. ఏదైనా సమాచారం కొరకు టిజిఎంఆర్ఈఐఎస్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ 7331170790 సంప్రదించాలని కోరారు.

## కేయూ ఆరోగ్య కేంద్రానికి నూతన డాక్టర్ లను నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారి

హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

కాకతీయ విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు డాక్టర్ లను నూతనంగా నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారిచేసారు, వీరిలో డాక్టర్ అభినవ్ కుమార్ దరిగి ని మేల్ మెడికల్ ఆఫీసర్ గా, డాక్టర్ లునావత్ అనుష ను ఫిమేల్ మెడికల్ ఆఫీసర్ గా ఫుల్ టైం ఒప్పంద ప్రాతిపదికన నియమించినట్టు ఆచార్య రామచంద్రం తెలిపారు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు వీరిని అబినందించారు.



## నేరస్థులను పట్టుకోవడంలో ఫింగర్ ప్రింట్ విభాగం పాత్ర కీలకం

పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్

సంఘటన జరిగిన ప్రదేశంలో నేరస్థుల అనవాళ్ళను గుర్తించి వారిని పట్టుకొవడంలో ఫింగర్ ప్రింట్ విభాగం కీలకంగా పనిచేస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. రాష్ట్ర ఫింగర్ ప్రింట్ విభాగం మంజూరు చేసిన అత్యాధునిక పరికరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా స్టేషన్ సిబ్బందికి గురువారం అందజేశారు. దేశంలోనే తోలిసారిగా తెలంగాణ ఫింగర్ ప్రింట్ విభాగం అధ్వర్యంలో నూతనంగా ఆటోమెటెడ్ మల్టీమోడల్ ఫ్రింగర్ ప్రింట్ ఐడెంటీఫికేషన్ సిస్టం పరిజ్ఞానాన్ని వినియోగించుకోని వ్రేలి ముద్రలతో పాటు నిందితులకు సంబందించిన కంటి కనుపాపలు, ముఖాలతో పాటు పాదముద్రలను సేకరించి నూతన పరిజ్ఞానం ద్వారా వీటిని భద్రపర్చడం జరుగుతుంది. ఇందుకొసం ఫింగర్ ప్రింట్ విభాగం మొదట విడతగా తొమ్మిడి పోలీసు స్టేషన్లకు జారీచేసిన పరికరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పోలీస్ స్టేషన్ సిబ్బందికి అందజేయడం జరిగింది. ఈ నూతన టెక్నాలజీ వినియోగంపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫింగర్ ప్రింట్ అధికారులు సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనివిధంగా నూతనంగా అందుబాటులోకి తీసుకవచ్చిన టెక్నాలజీని వినియోగించడంలో అధికారులు, సిబ్బంది నిష్ణాతులు కావాలని, స్టేషన్ అధికారులు సేకరించిన సమచారం ద్వారా నిందితులను గుర్తించడం చాలా సులభమవుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో వరంగల్ పోలీస్ కమినరేట్ ఫింగర్ ప్రింట్ ఇన్స్పెక్టర్లు రాజ్‌కుమార్, శ్రీధర్, రాజశేఖర్ పాల్గోన్నారు.

## శిక్షణలు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచుతాయి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

అధునాతన బోధన ఉపాధ్యాయుల లక్షణంగా ఉండాలి

ఉపాధ్యాయులు ఎప్పుడూ ముందుచూపుతో వ్యవహరించాలి

21వ శతాబ్దపు నైపుణ్యాలను ఉపాధ్యాయులు కలిగి ఉండాలి

ఉపాధ్యాయుల శిక్షణలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడానికి ఉపాధ్యాయుల కృషి చేయాలి



హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్



జిల్లాలో జరుగుతున్నటువంటి ఉపాధ్యాయుల శిక్షణలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఈరోజు సందర్శించి ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. శిక్షణలు ఏ విధంగా జరుగుతున్నాయో జిల్లా విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న వివిధ సబ్జెక్టులలో శిక్షణ పొందుతున్నటువంటి ఉపాధ్యాయుల సమావేశపు హాలులలోకి ప్రవేశించి ఉపాధ్యాయులతో ముచ్చటించారు. శిక్షణలు ఎలా ఉన్నాయి? ఇంకా ఏమైనా నూతన పద్ధతులు , నూతన విషయాల పట్ల శిక్షణ అవసరము ఉందా అని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులందరూ అధునాతన బోధన పద్ధతులతో పాటు, 21వ శతాబ్దపు బోధన మెలకువలను కలిగి ఉండాలని, దానికోసము శిక్షణలు అవసరమని ఆమె తెలిపారు. ప్రభుత్వము బైలింగ్వల్ ద్విభాష పాఠ్యపుస్తకాలను అందిస్తుందని, వాటి యొక్క అవసరము ఎలా ఉందని , వాటి ఉపయోగం ఎలా ఉందని ,ఆమె ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులలో ఆంగ్లం నైపుణ్యాలు పెంచాలని, తరగతి గదిని డిజిటలైజ్ చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థుల యొక్క ప్రవర్తనలను గమనించి, వారికి నైతిక విలువల పెంపు పట్ల అవగాహన కల్పించాలని, మార్గదర్శనం చేయాలని ఆమె తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ను ఉపయోగించి బోధన చేయాలని, ఉపాధ్యాయులు బోధనోపకరణాలను వాడటం ద్వారా విద్యార్థుల యొక్క అభ్యసనము సులువు అవుతుందని ఆమె తెలిపారు. గత మూడు రోజులుగా స్కిల్ స్టార్ కు ఇంటర్నేషనల్ పాఠశాలలో జరుగుతున్నటువంటి శిక్షణలలో సుమారు 470 మంది ఉపాధ్యాయులు గణితము, ఆంగ్లము, సాంఘిక శాస్త్రము, ఉర్దూ ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, మండల స్థాయి రిసోర్స్ పర్సన్ లకు శిక్షణ కొనసాగుతోంది. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి, గుణాత్మక విద్య సమన్వయకులు ఏ. శ్రీనివాస్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి, సెంటర్ ఇన్చార్జిల, రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

# ఈ నెల 25 యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష

**జిల్లా పరిధిలో 10పరీక్షా కేంద్రాలు**
**పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు**
**జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్-2025 నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో మే 25న జరగనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ కోసం హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలను కేటాయించడం జరిగిందన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను 4141 మంది అభ్యర్థులు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందన్నారు. మొదటి సెషన్ పరీక్ష మే 25న ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకు, రెండో సెషన్ లో పరీక్ష మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాల ముందుగానే చేరుకోవాలన్నారు. ఉదయం 9 తర్వాత, మధ్యాహ్నం 2 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోని కి అనుమతించరని పేర్కొన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు తో పాటు అందులో పేర్కొన్న గుర్తింపు కార్డులలో ఏదైన ఒక కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు. పరీక్ష కేంద్రానికి అడ్మిట్ కార్డుతో పాటు పెన్ను, పెన్సిల్ను వెంట తెచ్చుకోవాలన్నారు. చేతి గడియారాలు కూడా అనుమతించబడవని అన్నారు. యుపిఎస్సి ప్రిలిమినరీ పరీక్షలు ఉన్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉదయం 6 గంటల నుండి పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఒక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తను అందుబాటులో ఉంచి అవసరార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. యూపీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తున్న దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలన్నారు. పరీక్ష నిర్వహించే రోజున ఆర్టీసీ బస్సులు ఉదయం 7 గంటల నుండి ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, డీఈఓ వాసంతి, టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్ రావు, తహసీల్దార్లు, పరీక్షా కేంద్రాల సూపర్వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## తప్పిపోయిన పాపను కన్న తండ్రికి అప్పగించిన సిద్దిపేట టూ టౌన్ పోలీసులు



**సిద్దిపేట జిల్లా జై భీమ్ జై న్యూస్**

వాట్సాప్ గ్రూప్ లో సర్కులేట్ అయిన సమాచారాన్ని వారి దగ్గర బంధువులు చూసి పాప టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఉందని చెప్పగానే పాప తండ్రి దినేష్, రాష్ట్రం బీహార్ ప్రస్తుత నివాసం మారుతీ నగర్ సిద్దిపేట పట్టణం, టు టౌన్ పోలీస్ స్టేషన్కు రాగానే పూర్తి వివరాలు కనుక్కొని విచారణ అనంతరం పాప పూజను తన తండ్రికి అప్పగించిన టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ సిబ్బంది.

## ఓరుగల్లు శివ శక్తుల సంక్షేమ సంఘం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయినితో వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**వరంగల్ జై భీమ్ న్యూస్**

వరంగల్ ఉర్సుగుట్ట వద్ద నున్న నని గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం 'చౌదరి' బిరుదాంకిత కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సంద్రాభంగా శివశక్తులు ఇరువురికీ శాలువాలతో సత్కరించారు. అనంతరం 'చౌదరి' బిరుదాంకితలకు అవార్డులను అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ శివశక్తుల సంక్షేమ సంఘం అనేది తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఒక ప్రత్యేకమైన సామాజిక వ్యవస్థ అని.. ఈ వ్యవస్థలో వీరు దేవాలయాలకు లేదా ఇతర మతపరమైన కార్యక్రమాలకు ప్రత్యేకంగా అంకితం చేయబడిన వారుగా పరిగణిస్తారని, శివ శక్తుల సంక్షేమ సంఘం అనేది సంక్షేమం మరియు హక్కుల కోసం పని చేసే ఒక సంస్థలాగా విద్యా, ఆర్థిక మరియు సామాజిక సహాయం అందిస్తూ.. సామాజికంగా కుడా చాలా మందికి సాయాన్ని అందిస్తారని కొనియాడారు.

## కేయూ ఫార్మసీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా ఆచార్య జే. కృష్ణవేణిని నియమిస్తూ ఉత్తర్వులు జారి





**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ అండ్ హెడ్ గా ఆచార్య జే. కృష్ణవేణి ని రెండు సంవత్సరాల కాలానికి నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారి చేసారు, ఆచార్య కృష్ణవేణి ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్ ప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు, ఆచార్య కృష్ణ వేణి నేతృత్వం లో 4 గురు పరిశోధకులు తమ పిహెచ్ డి పట్టా సాదించారు, ఆచార్య కృష్ణవేణి జాతీయ సేవ పథకం ప్రోగ్రాం ఆఫీసర్ గా, వసతి గృహ సంయుక్త సంచాలకులు గా, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు గా పని చేసారు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య కృష్ణవేణి ని అబినందించారు.

## సీడ్ కంపెనీలకు మంత్రి సీతక్క హెచ్చరిక

**రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం**

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

హైదరాబాదులోని అగ్రికల్చర్ డైరెక్టరేట్ కార్యాలయంలో విత్తన కంపెనీల ప్రతినిధులతో మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. వాజేడు, వెంకటాపూర్ మండలాలతో పాటు కన్నాయిగుడెంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ పక్షంలో కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టి, క్రిమినల్ చర్యలు చేపడుతామని హెచ్చరించారు. విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ములుగు జిల్లా కలెక్టర్ దివాకరా, పలువురు వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా పలు సీడ్ కంపెనీల తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసి.. నకిలీ విత్తనాలతో నష్టపోయిన పంటలను, రైతులను వివరాలను సేకరించి అనుగుణంగా రైతులకు కంపెనీల ద్వారా నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్కు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసే సహించేది లేదని.. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైల్లో వేస్తామని మంత్రి సీతక్క హెచ్చరించారు.



## హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ లో డాక్టరేట్ పొందిన వై ప్రియరాణి

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**




కాకతీయ విశ్వవిద్యాలయ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మానేజ్మెంట్ విభాగ పరిశోధకురాలు ప్రియా రాణి వై. కి విశ్వవిద్యాలయ పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల హ్యూమన్ రిసోర్స్ మానేజ్మెంట్ లో డాక్తోరాటే ప్రకటించారు, డాక్టర్ ప్రియా రాణి. వై హ్యూమన్ రిసోర్స్ ప్లానింగ్ అండ్ రీటెన్షన్ స్త్రటజిస్ ఇన్ సెలెక్ట్ ఐటి. కంపెనీస్ ఇన్ హైదరాబాద్ %-% ఎ స్టడీ (హ్యూమన్ రిసోర్స్ ప్లానింగ్ అండ్ రేటెన్షన్ స్ట్రాటెజిస్ ఇన్ సెలెక్ట్ ఇట్ కంపెనీస్ ఇన్ హైదరాబాద్ %-% ఏ స్టడీ) అనే అంశం పై విభాగ ఆచార్యులు, తెలంగాణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి.యాదగిరి రావు పర్యవేక్షణలో పూర్తి చేసారు, డాక్టర్ ప్రియా రాణి వై. ని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అబినందించారు.

## రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మని కలిసిన కేయూ వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి



**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

కాకతీయ విశ్వవిద్యాలయ "23 వ స్నాతకోత్సవ" నిర్వహణ నిమిత్తం కాకతీయ విశ్వవిద్యాలయ ఛాన్సలర్, తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను, అనుమతి ని కోరుతూ హైదరాబాద్ రాజ్ భవన్ లో వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి కలిసినట్టు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు, జూలై మొదటి వారం లో స్నాతకోత్సవ నిర్వహణకు సూత్రప్రాయంగా అంగీకారించినట్టు తెలిపారు, పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల వైస్ ఛాన్సలర్ వెంట ఉన్నారు.

## అంబేద్కర్ భవనంలో బి.చెన్నకృష్ణప్ప శ్రద్ధాంజలి సభ

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక రాష్ట్రంలోని ప్రముఖ దళిత నాయకుడు బి. చెన్నకృష్ణప్ప శ్రద్ధాంజలి సభ బెంగళూరు నగరంలోని అంబేత్కర్ భవనంలో బుధవారం రోజు కర్ణాటక ప్రభుత్వం చెన్నకృష్ణప్ప కుటుంబ సభ్యులు మరియు దళిత నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బి. చెన్నకృష్ణప్ప చిత్రపటానికి దళిత నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. గత వారంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చెన్నకిష్టప్ప దుర్మరణం చెందిన విషయం తెలిసిందే, కర్ణాటక రాష్ట్రంలోని దొడ్డబల్లాపుర జిల్లాలో వివాహ కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి బెంగళూరు ప్రయాణించే సమయంలో కారు ప్రమాదంలో దుర్మరణం చెందారు. శ్రద్ధాంజసభలో కన్నల్లి కృష్ణప్ప మాట్లాడుతూ ప్రముఖ దళిత నాయకుడు, కర్ణాటక సమతా సైనిక దళ రాజ్యాధ్యక్షుడు బి. చెన్నకృష్ణప్ప దుర్మరణం చెందడం దళిత సమాజానికి తీరనిలోటని అన్నారు. దళిత సమాజాన్ని తన కుటుంబంగా భావించిన చెన్నకృష్ణప్ప, తన సంస్థ మరియు శక్తివంతమైన ప్రసంగం ద్వారా గొంతులేని అణగారిన సమాజానికి గొంతుకగా నిలిచారు, ఉద్యమ మార్గంలో మూడున్నర దశాబ్దాలకు పైగా సామాజిక న్యాయం కోసం పోరాటాలను రూపొందించారు అని అన్నారు. ఆయన చాలా చురుకైన సామాజిక కార్యకర్త, అనేక ప్రభుత్వ సంస్థలలో అమూల్యమైన సేవలను అందించారు. ఆయన కుటుంబ సభ్యులు మరియు స్నేహితులు ప్రాణాలతో బయటపడ్డారు. చెన్న కృష్ణప్ప శ్రద్ధాంజలి సభలో కర్ణాటక రాష్ట్రంలోని పలువురు దళిత నాయకులు హృదయపూర్వక నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సభలో కన్నల్లీ కృష్ణప్ప, కె మరియప్ప, గంగన్న, మరి , మైకేల్ మరియు దళిత నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV

# వడ్డీ రేట్ల తగ్గింపు అనివార్యం..!



రుణ గ్రహీతలపై హెచ్చు వడ్డీ రేట్ల భారాన్ని తగ్గించడానికి సమయం అసన్నమయ్యింది. ఇటీవల కాలంలో ద్రవ్యోల్బణం సూచీ తగ్గుముఖం పట్టడంతో వడ్డీ రేట్లకు కోత పెట్టడానికి వీలుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు ఆరేళ్ల కనిష్టానికి పడిపోయింది. సాధారణంగా అల్ప స్థాయిలో ద్రవ్యోల్బణం, తక్కువ వడ్డీ రేట్లు జిడిపి వృద్ధికి మద్దతును అందిస్తాయి. దీంతో ప్రజల వద్ద ఆదాయాలు పెరగడంతో కొనుగోళ్లకు మద్దతు లభించనుంది. ఈ నేపథ్యంలో వడ్డీ రేట్ల తగ్గింపు అనివార్యమని నిపుణులు సూచిస్తున్నారు. బుధవారం కేంద్ర గణంకాల శాఖ విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఏప్రిల్‌లో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.16 శాతానికి దిగివచ్చింది. ఇది 2019 జులై నాటి కనిష్ట స్థాయి. మరోవైపు టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) తగ్గింది. గడిచిన ఏప్రిల్‌లో డబ్ల్యుపిఐ 0.85 శాతానికి పరిమితమై 13 నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం నెలలో ఇది 2.05 శాతంగా చోటు చేసుకుంది. ముఖ్యంగా అహార ఉత్పత్తుల ధరలు దిగిరావడమే ఇందుకు కారణం. మార్చిలో 4.66 శాతంగా ఉన్న అహారోత్పత్తుల ద్రవ్యోల్బణం, ఏప్రిల్‌లో 2.55 శాతానికి తగ్గింది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 3.07 శాతం నుంచి 2.62 శాతానికి దిగివచ్చింది. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం ఏకంగా 0.20 శాతం నుంచి మైనస్ 2.18 శాతానికి పడిపోవడం విశేషం. ద్రవ్యోల్బణం ఆధారంగానే ఆర్‌బిఐ వడ్డీ రేట్లలో మార్పులు చేస్తుంది. రిటైల్, టోకు ద్రవ్యోల్బణం దిగిరావడంతో ఆర్‌బిఐ ఎంపిసి ద్రవ్య సమీక్షల్లో రెపోరేటు మరింత దిగిరానుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును పావు శాతం లేదా 25 బేసిస్ పాయింట్లు చొప్పున మొత్తం అర శాతం తగ్గించింది. ఫలితంగా ఎట్టకేలకు రెపో రేటు 6 శాతానికి దిగివచ్చింది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినందున రిజర్వు బ్యాంక్ వడ్డీ రేట్లను భారీగా తగ్గించడానికి వీలుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రీసెర్చ్ ఇటీవల పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 3 శాతం దిగువకు తగ్గొచ్చని తెలిపింది. ఇదే పరిస్థితి కొనసాగితే వడ్డీ రేట్లను 125 బేసిస్ పాయింట్లు (1.25 శాతం) తగ్గించడానికి వీలుందని పేర్కొంది. జూన్-ఆగస్టు సమయంలో 75 బేసిస్ పాయింట్లు వడ్డీ రేట్ల తగ్గింపును అంచనా వేస్తున్నాము. ద్వితీయార్ధంలో మరో 50 బేసిస్ పాయింట్లు తగ్గించడానికి వీలుందని పేర్కొంది.

## స్వల్పంగా దిగి వచ్చిన పసిడి.. అదే బాటలో వెండి..



భారతీయులకు బంగారం కొనుగోలు చేయడం భలే ఇష్టం. ఈ ఇష్టంతోనే ఎటువంటి సందర్భం వచ్చినా సరే వెంటనే బంగారం నగలు కొనుగోలు చేయడనికి ఆసక్తిని చూపిస్తారు. అందుకనే ప్రతి సంవత్సరం టన్నులకు టన్నుల బంగారం మన దేశం దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. అయితే అంతర్జాతీయ మార్కెట్ లో పరిస్థితి ఆధారంగా దేశీయంగా కూడా పసిడి వెండి ధరలపై ప్రభావం చూపిస్తాయి. పసిడి , వెండి ధరల్లో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. భారతీయులు బంగారం నగలను ఓ స్టేటస్ సింబల్ గా మాత్రమే కాదు ఎప్పుడైనా అనుకోని విధంగా ఆర్ధిక ఇబ్బందులు కలిగే అప్పుడు బంగారం ఆదుకుంటుందని .. ఆర్థిక భరోసా ఇస్తుందని నమ్మకం. అందుకనే పండగలు, పెళ్ళిళ్ళు, శుభకార్యాలు ఇలా ఏ సందర్భం వచ్చినా .. ఇంకా చెప్పాలంటే ఎప్పుడు డబ్బులు ఉంటే అప్పుడు.. ఏడాది పొడవునా బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఆసక్తినిమ చూపిస్తూ ఉంటారు. అదే సమయంలో ప్రస్తుతం బంగారం, వెండిపై పెట్టుబడులను పెట్టడానికి ముదుపర్లు ఆసక్తిని చూపిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం బంగారం ధర ఆల్ టైం హైకి చేరుకొని పసిడి ప్రియులకు షాక్ ఇచ్చింది. అయితే అంతర్జాతీయ మార్కట్ లో డాలర్ బలపడడంతో నేడు బంగారం ధర స్వల్పంగా తగ్గింది. హైదరాబాద్ లో గురువారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 88,040 ఉండగా.. 24 క్యారెట్ల (మేలిమి బంగారం) 10 గ్రాముల బంగారం ధర రూ.96,050 లుగా కొనసాగుతోంది. ఇవే ధరలు తెలుగురాష్ట్రాల్లో ప్రధాన నగరాలైన రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, పొద్దుటూరులలో కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ. 88,040గా ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.96,200 లుగా ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ. 88,040 వద్ద ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 96,050 వద్ద కొనసాగుతోంది. ఇవే ధరలు దేశంలో ప్రధాన నగరాలైన కేరళ, కోల్ కతా, పూణే, బెంగళూరు లో కూడా కొనసాగుతున్నాయి. బంగారంతో పాటు వెండి కూడా మంచి ఆదరణ ఉంది. ఎటువంటి సందర్భం వచ్చినా బహుమతులుగా వెండి వస్తువులు ఇవ్వడానికి ఆసక్తిని చూపిస్తారు. అయితే గతంలో కంటే ఇప్పుడు వెండితో రకరకాల ఆభరణాలను తయారు చేస్తున్నారు. ఇవి నేడు ట్రెండీగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కిలో వెండి ధర ఒకానొక సమయంలో లక్ష దాటింది కూడా.. ఈ నేపథ్యంలో నేటి వెండి ధర ఎలా ఉన్నదో తెలుసుకుందాం.. దేశ వ్యాప్తంగా పసిడి బాటలో నడుస్తూ వెండి ధర స్వల్పంగా దిగి వచ్చింది. ఈ నేపద్యంలో రోజు గురువారం కేజీ వెండి ధర రూ. 1,08,900లు ఉండగా.. ఇదే ధర కేరళ, చెన్నై లో కూడ ఉంది. అయితే దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 97,800 ఉంది. ఇదే ధర కోల్ కతా, బెంగుళూరు లో కొనసాగుతోంది.

## మైక్రోసాఫ్ట్‌లో 6వేల మందికి ఎసరు

ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వేలాది మంది ఉద్యోగులపై వేటు వేయడానికి సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో దాదాపు 6,000 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. 2023లో 10,000 మందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది. మైక్రోసాఫ్ట్‌లో 2024 జూన్ నాటికి 2.28 లక్షల మంది సిబ్బంది పని చేస్తోన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కూడా పనితీరు ఆధారంగా పలువురు ఉద్యోగులను సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూనే ఉంటామని మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుందని తెలుస్తోంది.




## ఒడుదుడుకుల్లోనూ లాభాలొచ్చాయ్

దేశీయ మార్కెట్ సూచీలు బుధవారం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ లాభాలు నమోదు చేశాయి. గత నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 6 ఏళ్ల కనిష్ఠ స్థాయి 3.16 శాతానికి తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు కొనసాగడంతో పాటు మెటల్, ఇండస్ట్రియల్ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 182.34 పాయింట్ల వృద్ధితో 81,330.56 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎసఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.79 లక్షల కోట్లు పెరిగి రూ.434.89 లక్షల కోట్లకు (5.10 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. భారత్ జపాన్‌ను వెనక్కి నెట్టి ఆసియాలో అత్యంత ప్రాధాన్య ఈక్విటీ మార్కెట్‌గా నిలిచింది. బ్యాంక్ ఆఫ్ అమెరికా తాజాగా నిర్వహించిన ఆసియా ఫండ్ మేనేజర్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న ఫండ్ మేనేజర్లలో 42 శాతం భారత ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులకు మొగ్గుచూపారు. ఈ విషయంలో జపాన్ రెండో స్థానానికి జారుకోగా.. గతనెల అట్టడుగు స్థాయిలో నిలిచిన చైనా మళ్లీ మూడో స్థానానికి ఎగబాకింది.



## ఏజీఐ గ్రూప్‌తో స్టాండర్డ్ గ్లాస్ ఒప్పందం

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్).. జపాన్‌కు చెందిన ఏజీఐ గ్రూప్, దాని అనుబంధ సంస్థ జీఎల్ హక్కోతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఈ ఒప్పంద కాలపరిమితి 20 సంవత్సరాలని తెలిపింది. ఒప్పందంలో భాగంగా జీఎల్ హక్కోకు చెందిన గ్లాస్-లైన్డ్ షెల్, ట్యూబ్ హీట్ ఎక్స్ఛేంజర్స్‌ను భారత్‌లో తయారు చేయటంతో పాటు మార్కెట్ చేయనున్నట్లు స్టాండర్డ్ గ్లాస్ తెలిపింది. ఇప్పటి వరకు ఈ స్పెషలైజ్డ్ పరికరాలను పూర్తిగా దిగుమతి చేసుకుంటూ వస్తున్నామని, భారత్‌లో తొలిసారిగా స్లాండర్డ్ గ్లాస్ వీటి తయారీ, విక్రయాలను చేపడుతోందని సంస్థ ఎండీ నాగేశ్వర రావు తెలిపారు. ఏజీఐ, జీఎల్ హక్కోతో కుదుర్చుకున్న ఒప్పందం తమకే కాకుండా భారత ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు ఎంతో మేలు చేకూర్చనుందన్నారు. గ్లాస్-లైన్డ్ షెల్, హీట్ ఎక్స్ఛేంజర్స్‌కు అంతర్జాతీయంగా 200 కోట్ల డాలర్ల మార్కెట్ ఉండగా.. ఒక్క భారత్‌లోనే రూ.2,000 కోట్ల మార్కెట్ ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంట్‌లో ప్రతి నెల 200 యూనిట్ల సామర్థ్యంతో ఈ ఉత్పత్తుల తయారీని చేపట్టాలని చూస్తున్నట్లు నాగేశ్వర రావు తెలిపారు.




## బీమా రంగంలోకి అపోలో 24/7

నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే లక్ష్యంతో బీమా రంగంలోకి ప్రవేశిస్తున్నామని అపోలో హెల్త్‌కో సిఇఒ మాధివనన్ బాలకృష్ణన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే హెల్త్, లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ పాలసీలను అందుబాటులోకి తేనున్నామని చెప్పారు. అపోలో హెల్త్‌కో ద్వారా రాబోయే రెండు నెలల్లో 12 బీమా సంస్థల నుంచి బీమా ఉత్పత్తులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొదటి ఏడాదిలో రూ.80 కోట్ల ఆదాయం సాధించాలని నిర్దేశించుకున్నామన్నారు. ఆరోగ్య సంరక్షణ ఖర్చులు తగ్గించడం, చెల్లింపుల సౌలభ్యాన్ని పెంచడంలో భాగంగా అపోలో 24/7 దేశంలోనే తొలిసారి 'హెల్త్-ఫస్ట్ క్రెడిట్ కార్డ్'ను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డ్ ద్వారా లక్షలాది మంది వినియోగదారులు ఆరోగ్య సేవలు మరింత సులభంగా పొందగలుగుతారని చెప్పారు.



# ప్రి క్వార్టర్స్‌కు ఆకర్షి, ఉన్నతి

థాయిలాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా ప్రవేశించారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో ఆకర్షి కశ్యప్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో 21-16, 20-22, 22-20తో ఎగ్జిన్ సుగియామా(జపాన్)పై విజయం సాధించింది. 17ఏళ్ల ఆకర్షి తొలి గేమ్‌ను సునాయాసంగా చేజిక్కించుకున్నా.. రెండో గేమ్‌ను ముగించడానికి చెమటోడ్చాల్సి వచ్చింది. ఇక ఉన్నతి హుడా 21-14, 18-21, 23-21తో నితిత్‌కరారు(ఇండోనేషియా)పై చెమటోడ్చి నెగ్గింది. మరో పోటీలో సంతోష్ రామ్‌రాజ్ 19-21, 7-21తో 8వ ర్యాంక్ క్రీడాకారిణి, సింగపూర్‌కు చెందిన యో-జి-మిన్ చేతిలో ఓటమిపాలైంది. ఇక మాల్విక బన్సోద్ 21-12, 13-21, 21-17తో సింగపూర్‌కు చెందిన నిషిహోన్‌పై పోరాడి గెలుపొందగా.. అనుపమ ఉపాధ్యాయ 11-21, 9-21తో 7వ ర్యాంకర్ థాయిలాండ్ కు చెందిన ఇంటనాన్ చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ప్రధాన టోర్నీకి అర్హత సాదించిన తరుణ్ మన్నేపల్లి, స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, ప్రియాన్షు రాజ్‌వత్ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు.








## మూడో ర్యాంక్‌లో హర్మన్‌ప్రీత్ సేన

అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ సేన సత్తా చాటింది. ఐసిసి బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత్ 8రేటింగ్ పాయింట్లు జమ చేసుకొని 2వ ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్‌కు చేరువైంది. శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు సిరీస్ టైటిల్‌ను చేజిక్కించుకున్న హర్మన్‌ప్రీత్ సేన ఖాతాలో ఎనిమిది రేటింగ్ పాయింట్లు జమ అయ్యాయి. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్(121 రేటింగ్ పాయింట్లు) 3వ స్థానంలో నిలువగా.. ఇంగ్లండ్(127) 2వ స్థానంలో ఉంది. ఇక ఆస్ట్రేలియా మహిళల జట్టు 167 రేటింగ్ పాయింట్లతో మిగతా జట్లకు అందనంత దూరంలో టాప్‌లో కొనసాగుతోంది. ఇక న్యూజిలాండ్(96), దక్షిణాఫ్రికా(90) టాప్-5లో నిలువగా.. శ్రీలంక(82), వెస్టిండీస్(72), బంగ్లాదేశ్(79), పాకిస్తాన్(78) టాప్-10లో చోటు దక్కించుకున్నాయి.

## విరాట్ స్థానంలో అతన్ని జట్టులోకి తీసుకోండి:

కింగ్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది అభిమానులందరికీ షాక్ ఇచ్చాడు. ప్రతిష్టాత్మక ఇంగ్లండ్ పర్యటనకు ముందు కోహ్లీతో పాటు రోహిత్ కూడా రిటైర్ అవ్వడం జట్టుకు గట్టి దెబ్బే అని చెప్పుకోవాలి. అయితే విరాట్ రిటైర్ అవ్వడంతో అతని స్థానంలో జట్టులోకి ఎవరకు వస్తారనే చర్చ జరుగుతోంది. ఓపెనర్లుగా శుభ్‌మాన్ గిల్, యశస్వీ జైస్వాల్‌లు బరిలోకి దిగుతారనేది స్పష్టమవుతోంది. కానీ, సమస్యల్లా కోహ్లీ బ్యాటింగ్ చేసే నాలుగో స్థానానిదే. ఈ ప్లేస్ ఎవరిని తీసుకుంటారా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే టీం ఇండియా లెజండరీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే ఈ సమస్యకు ఓ పరిష్కారాన్ని సూచించారు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టి ప్రస్తుతం ఐపిఎల్ ఆడుతున్న కరుణ్ నైర్‌ని జట్టులోకి తీసుకొని అతన్ని నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కి పంపించాలని కుంబ్లే అన్నారు. దేశవాళీ క్రికెట్‌లో అతను పరుగుల వరద పారించాడని.. పైగా అతను కౌంటీ క్రికెట్‌లో కూడా ఆడాడని.. తద్వారా ఇంగ్లండ్ పరిస్థితులు అతనికి తెలుసని పేర్కొన్నారు. అతని వయస్సు 30 దాటిన ఇంకా యంగ్‌గానే ఉన్నాడని తెలిపారు. అతనికి అవకాశం లభిస్తే యువ ఆటగాళ్లకు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాలనే ఆసక్తి పెరుగుతోందని కుంబ్లే స్పష్టం చేశారు.






## నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం

ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, భారత దిగ్గజ అథ్లెట్ నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం లభించింది. టెరిటోరియల్ ఆర్మీలో నీరజ్‌కు లెఫ్టినెంట్ కర్నల్ గౌరవ హోదాను ప్రదానం చేశారు. ఈ విషయాన్ని భారత రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఇది ఈ ఏడాది ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి వస్తుందని ఆ ప్రకటలో వెల్లడించింది. గతంలో నీరజ్ చోప్రా భారత సైన్యంలో సుబేదార్‌గా వ్యవహరిచారు. తాజాగా ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన లెఫ్టినెంట్ కర్నల్ హోదా లభించింది. టోక్యో వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో ఒలింపిక్స్ అథ్లెటిక్స్ వ్యక్తిగత విభాగంలో పసిడి పతకం సాధించిన తొలి భారత క్రీడాకారుడిగా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అంతేగాక పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో కూడా నీరజ్ పతకం సాధించారు. ఈ క్రీడల్లో ఆయన రజతం గెలిచారు. కాగా, నీరజ్‌కు పలు ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు లభించాయి. కేంద్ర ప్రభుత్వం నీరజ్‌కు పరమ విశిష్ట సేవా పతకంతో సత్కరించింది. అంతేగాక భారత అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యా న్‌చంద్ ఖేల్రత్న పురస్కారాన్ని కూడా నీరజ్ అందుకున్నారు. అంతేగాక 2022లో పద్మశ్రీ అవార్డు కూడా నీరజ్‌ను వరించింది. కాగా, భారత క్రీడారంగానికి చెందిన ఎంఎస్ ధోనీ, కపిల్ దేవ్, అభినవ్ బింద్రా తదితరులు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ హోదాను దక్కించుకున్నారు. తాజాగా వీరి సరసన నీరజ్ చోప్రా చేరారు.

## గంభీర్‌పై అలకతోనే సీనియర్ల రిటైర్మెంట్?



స్వల్ప వ్యవధిలో ముగ్గురు టీమిండియా సీనియర్ క్రికెటర్లు టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం సంచలనంగా మారింది. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్‌గవాస్కర్ సిరీస్ మధ్యలోనే సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ హఠాత్తుగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ నిర్ణయం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. సిరీస్ మధ్యలో అశ్విన్ అప్పట్లో తీసుకున్న రిటైర్మెంట్ నిర్ణయంపై పలు కథనాలు వినిపించాయి. టీమిండియా ప్రధాన కోచ్ గౌతం గంభీర్ వైఖరీతో విసుగు చెందిన అశ్విన్ ఏకంగా అంతర్జాతీయ క్రికెట్‌కే వీడ్కోలు పలికేశాడు.అశ్విన్ నిర్ణయం అప్పట్లో భారత క్రికెట్‌లో పెను ప్రకంపనలు సృష్టించింది. ఇక ఇటీవల కాలంలో మరో ఇద్దరు సీనియర్ క్రికెటర్లు కూడా సంప్రదాయ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ అనూహ్యంగా టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. మరి కొంతకాలం పాటు అతను టెస్టుల్లో కొనసాగడం ఖాయమని అందరూ భావించారు. కానీ అందరిని విస్మయానికి గురి చేస్తూ రోహిత్ టెస్టు క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. తాజాగా మరో స్టార్ ఆటగాడు, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ చెప్పేశాడు. కనీసం రెండు మూడేళ్ల పాటు టెస్టు క్రికెట్‌లో కొనసాగే ఫిట్‌నెస్ కోహ్లికి ఉంది. అయినా అతను అనూహ్యంగా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడం భారత క్రికెట్‌లో చర్చనీయాంశంంగా మారింది. ప్రధాన కోచ్ గంభీర్‌తో పడకనే కోహ్లి ఈ నిర్ణయం తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి. ముందు నుంచే గంభీర్‌కు సీనియర్లపై మంచి అభిప్రాయం లేదు. ఐపిఎల్‌లో వివిధ జట్లకు కోచ్‌గా వ్యవహరించిన గంభీర్ సీనియర్లపై చిన్నచూపు చూశేవాడు. అతని వైఖరి నచ్చక భారత్‌తో పాటు విదేశాలకు చెందిన క్రికెటర్లు సయితం ఆయా ఫ్రాంచైజీలకు గుడ్‌బై చెప్పేసిన సందర్భాలు ఉన్నాయి. తాజాగా అశ్విన్, రోహిత్, కోహ్లిలు తీసుకున్న రిటైర్మెంట్ నిర్ణయం వెనుక కూడా గంభీరే ప్రధాన కారణంగా ఉన్నాడని వార్తలు వినవస్తున్నాయి. సీనియర్ల కంటే యువ ఆటగాళ్లపైనే గంభీర్ ఎక్కువ నమ్మకాన్ని ఉంచుతాడు. కోల్‌కతాను మెరుగైన జట్టుగా తీర్చిదిద్దడంలో గంభీర్ కీలక పాత్ర పోషించాడు. సీనియర్లు జట్టులో ఉన్నా అతను మాత్రం యువకులపైనే ఎక్కువ నమ్మకం ఉంచేవాడు. తాజాగా టీమిండియాలో కూడా గంభీర్ వైఖరీనే అవలంభించాడు. ఇది సీనియర్లకు రుచించలేదు. అందుకే ఒకరి వెంట ఒకరు ముగ్గురు సీనియర్ ఆటగాళ్లు టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశారు. ఇలా కీలక ఆటగాళ్లు జట్టుకు దూరం కావడంతో దాని ప్రభావం టీమిండియాపై బాగానే చూపే అవకాశం ఉంది. అయితే దీనిపై ఇప్పటి వరకు గంభీర్‌తో సహా కోహ్లి, అశ్విన్, రోహిత్‌లు ఎలాంటి ప్రకటన చేయలేదు.

## పాక్‌కు టర్కీ సాయం

ఆపరేషన్ సిందూర జరిగీ జరగకముందే టర్కీకి చెందిన అత్యంత అధునాతన శక్తివంతమైన యుద్ధనౌక ఒకటి వచ్చి పాకిస్థాన్ కరాచీ రేవులో లంగరు వేసుకు నిలిచింది. ఇక భారతదేశానికి వ్యతిరేకంగా పాక్ సైన్యం సాగించిన దాడులకు వెనుక ఉండి ఈ ఇస్తాంబుల్ వాలా టర్కీ నేత ఎర్డోగాన్ అదేపనిగా సైనిక సాయానికి అర్రులుసాచాడు. ఆయనకు ఏ క్షణంలో భారత్ పట్ల ఆగ్రహం అంతకు మించిన అక్కసు నెలకొందో తెలియక విశ్లేషకులు తల్లడిల్లారు. ఇటీవల భారతీయ సైనిక బలగాలు ప్రయోగించిన అనేక క్షిపణులు నేలకూల్చిన డ్రోన్లలో అత్యధిక సంఖ్యలో టర్కీ డ్రోన్లు ఉండటం కీలకం అయింది. సాంకేతిక పరిజ్ఞానం సాధనాసంపత్తి ఏ మేరకు ఉందో తెలియదు కానీ టర్కీ విరివిగా పంపిన డ్రోన్లు అనేకం పతనం చెందాయి. పలు చోట్ల వీటి అవశేషాలు వెలుగులోకి వచ్చాయి. డ్రోన్లనే కాకుండా టర్కీవాలాలు వీటిని నడిపే నిర్వాహకులు ఛోదకులు ఇతర సాంకేతిక సిబ్బందిని కూడా తమ మిత్రదేశానికి తరలించి తాము సైతం ఈ భారత్‌పై యుద్ధంలో అని చాటుకోవడం ఇప్పుడు టర్కీ నేత కు భారత్ పట్ల నిండుకుని ఉన్న పరిపూర్ణ విద్వేషానికి ప్రతీక అయింది. 350కు పైగా డ్రోన్లను పాకిస్థాన్‌కు టర్కీ తరలించినట్లు గుర్తించారు. టర్కీ డ్రోన్ల శకలాల ఫోటోలను ఇప్పుడు భారతీయ సైన్యం అధికారికంగా మీడియాకు పంపించింది. ఏ వేదికపై అవకాశం దక్కినా భారత్‌కు వ్యతిరేకంగా నిందలు దిగడం, కశ్మీర్ పాక్ హక్కు అని చెప్పడం ఎర్డోగావ్ మిత్రకృత్యంఅయింది. ఇందులో భాగంగానే డ్రోన్లను పంపించారు.


## జట్టులో చోటే కష్టం.. అలాంటి వాడికి కెప్టెన్సీనా?

టీం ఇండియా మరికొద్ది రోజుల్లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న విషయం తెలిసిందే. అయితే ఈ సిరీస్‌కి జట్టును ఎంపిక చేయడం సెలెక్టర్లకు పెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే కొద్ది రోజుల క్రితం టెస్ట్ క్రికెట్ నుంచి రోహిత్ శర్మ.. అతని బాటలోనే విరాట్ కోహ్లీ రిటైర్‌మెంట్ ప్రకటించారు. దీంతో జట్టుకు తదుపరి కెప్టెన్‌గా ఎవరిని నియమించాలనే సమస్య తలెత్తింది. కొంత మంది స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ఈ బాధ్యతలు అప్పగిస్తారని అంటుండగా.. మరికొందరు శుభ్‌మాన్ గిల్‌కు ఈ బాధ్యతలు లభిస్తాయని అంటున్నారు. బుమ్రాకు కెప్టెన్సీ అప్పగిస్తే బాగుంటుందని సునీల్ గవాస్కర్, అనిల్ కుంబ్లే వంటి మాజీలు అభిప్రాయపడ్డారు. కానీ, శుభ్‌మాన్ గిల్‌పై మాత్రం మాజీ క్రికెటర్ కృష్ణమాచార్య శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. టెస్ట్ ఆడే తుది జట్టులో అతనికి చోటు దక్కడమే డౌట్ అని.. అలాంటి వ్యక్తికి కెప్టెన్సీ ఎలా ఇస్తారని శ్రీకాంత్ ప్రశ్నించారు. ఇప్పటివరకూ తన కెరీర్‌లో 32 మ్యాచులు ఆడిన గిల్ ఏడు హాఫ్ సెంచరీలు, 5 సెంచరీలతో 1893 పరుగులు చేశాడు. అయితే విదేశీ గడ్డపై అతనికి మంచి రికార్డు లేదు. బార్డర్ - గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టుల సిరీస్‌లో గిల్ కేవలం 93 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో శ్రీకాంత్.. గిల్‌పై విమర్శలు చేశారు. “వెస్టిండీస్, సౌతాఫ్రికా పర్యటనలో ఈ బ్యాట్స్‌మెన్స్ అంతగా రాణించలేదు. టెస్ట్ క్రికెట్‌లో అతను టెస్ట్ క్రికెట్‌లో ఇంకా పూర్తిగా నిలదొక్కుకోలేదు. అందుకే అతని స్థానంలో జస్ప్రిత్ బుమ్రానే కెప్టెన్ చేయడం ఉత్తమం. ఒకవేళ అతను ఫిట్‌గా లేకపోతే.. కెఎల్ రాహుల్ లేదంటే రిషబ్ పంత్‌ను కెప్టెన్ చేయడం బెటర్” అని శ్రీకాంత్ అన్నారు.



# సినీ పితామహుడుగా జూనియర్ ఎన్టీఆర్ ?

ప్రస్తుతం వార్ 2, ప్రశాంత్ నీల్ సినిమా, దేవర 2లకు కమిట్ మెంట్ ఉన్న జూనియర్ ఎన్టీఆర్ ఆ తర్వాత ఒక షాకింగ్ బయోపిక్ చేసే అవకాశాలున్నాయంటూ ముంబై మీడియాలో వస్తున్న కథనాలు షాక్ ఇచ్చేలా ఉన్నాయి. వాటి ప్రకారం సినీ పితామహుడిగా పరిశ్రమగా కొనియాడే దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ లో నటించేందుకు తారక్ సుముఖత వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు వెనుక రాజమౌళి, కార్తికేయ, వరుణ్ గుప్తా (మ్యాక్స్ స్టూడియోస్) ప్రమేయం ఉందని అందులో పొందుపరిచారు. స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని, వినగానే జూనియర్ ఎగ్జైట్ అయిపోయి అంగీకారం తెలిపాడని పేర్కొన్నారు. అసలు దాదాసాహెబ్ ఫాల్కే జీవితం ఎంత గొప్పదైనా ఆయన జీవితంలోని డ్రామాని తారక్ లాంటి ప్యాన్ ఇండియా కమర్షియల్ స్టార్ తో వర్కౌట్ చేయించడం కష్టం. ఎందుకంటే మాస్ అంత సులభంగా కనెక్ట్ కారు. 1870 లో పుట్టిన ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే భారతదేశపు మొదటి సినిమా రాజా హరిశ్చంద్రకు నిర్మాత కం దర్శకులు. ఇది 1913లో రిలీజయ్యింది. మొత్తం 95 ఫీచర్ ఫిలింస్ తీసిన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. 1903లో ఆర్కియాలాజి డిపార్ట్ మెంట్ లో ఫోటోగ్రాఫర్ గా చేరాక ఫాల్కే జీవితం మలుపు తిరిగింది. 1910లో లైఫ్ అఫ్ క్రీస్ట్ చిత్రం చూశాక తాను సినిమా తీయాలని నిర్ణయించుకోవడం దేశ తలరాతను





మార్చింది. మొత్తం ఆస్తులు అమ్మి డబ్బులు పోగేసి సినిమా తీయడానికి అవసరమైన పరికరాలు పుస్తకాలు కొనేవారు. లండన్ వెళ్లి అయిదు పౌండ్లతో కెమెరా కొనుక్కుని వచ్చి ఒక షార్ట్ ఫిలిం తీసి స్నేహితుల దగ్గర తీసుకున్నది, తాకట్టు రూపంలో పోగేసింది మొత్తం కలిసి పది వేల రూపాయలతో నిర్మాత, దర్శకుడిగా కెరీర్ ప్రారంభించారు. నగలు అమ్మి డబ్బు ఇచ్చిన భార్య సరస్వతి బాయ్ ప్రోత్సాహం చాలా ఉంది.

## మామా అల్లుడు.. ఇద్దరూ దేవాలే



సూపర్ స్టార్ రజనీకాంత్ కూలీ ఆగస్ట్ 14 విడుదల కాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రమోషన్లు ఊపందుకున్నాయి. దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇంటర్వ్యూలు వైరల్ కావడం మొదలయ్యాయి. ఇంకా సరైన టీజర్ రాకుండా కేవలం ప్రోమో వీడియోలతోనే హైప్ ఎక్కడికో వెళ్ళిపోతోంది. నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్ర మల్టీ స్టారర్ క్యామియోలు అంచనాలను ఎక్కడికో తీసుకెళ్తున్నాయి. ఇందులో రజని పాత్ర పేరు దేవా. పోర్టులో మాఫియా సామ్రాజ్యం నడిపే ఒక పవర్ ఫుల్ క్యారెక్టర్ లో ఆయనని చూపించే విధానం మాములుగా ఉండదట. ఎలివేషన్లు, యాక్షన్ బ్లాకులు ఓ రేంజ్ లో వచ్చాయని టాక్. కాకతాళీయంగా కూలికి రెండు నెలల ముందు జూన్ 20 రిలీజవుతున్న కుబేరలో ధనుష్ పేరు కూడా దేవానే. బిచ్చం అడుక్కునే స్థాయి నుంచి ఆర్థిక వ్యవస్థని శాశించే కోటీశ్వరుడిగా హీరో పాత్రని దర్శకుడు శేఖర్ కమ్ముల చాలా ఇంటెన్స్ గా డిజైన్ చేశారట. అంటే పేరులోనే కాదు క్యారెక్టరైజేషన్ పరంగానూ కూలి, కుబేరలకు దగ్గరి పోలికలు కనిపిస్తున్నాయి. విచిత్రం ఏమిటంటే ఈ రెండు సినిమాల్లోనూ నాగార్జున ఉండటం. రజని కూతురితో ధనుష్ విడిపోయినప్పటికీ ఫ్యాన్స్ దృష్టిలో మాత్రం ఇద్దరూ మామ అల్లుడే. అందుకే ఇంత దగ్గరి సారూప్యతలు గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కంటెంట్, బిజినెస్ పరంగా కూలి, కుబేరలు హయ్యెస్ట్ ఫిగర్స్ నమోదు చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. డబ్బింగ్ హక్కులకు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. మన నిర్మాతల పోటీని చూసి ధరను వేలం పాట రేంజ్ లో పెంచుతున్నారని డిస్ట్రిబ్యూటర్ వర్గాల టాక్.

## మున్నాభాయ్ సీక్వెల్ మళ్లీ అటకెక్కిందా?



చేసిన సినిమాలు తక్కువే అయినా.. ఇండియన్ ఫిలిం హిస్టరీలోనే గ్రేటెస్ట్ డైరెక్టర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు రాజ్ కుమార్ హిరాని. కెరీర్ ఆరంభంలోనే ఆయనకు గొప్ప పేరు తెచ్చిన చిత్రాలు.. మున్నాభాయ్ ఎంబీబీఎస్, లగేరహెూ మున్నాభాయ్. ఆ తర్వాత 3 ఇడియట్స్, పీకే, సంజు లాంటి క్లాసిక్స్ అందించాడు. ఆయన చివరి చిత్రం 'డంకీ' ఓ మోస్తరు ఫలితాన్నందుకుంది. మళ్లీ తన మార్కు చూపించడానికి 'మున్నాభాయ్' ఫ్రాంఛైజీ మీద హిరాని దృష్టిసారించినట్లు వార్తలు వచ్చాయి. హిరాని సైతం తాను 'మున్నాభాయ్-3' స్క్రిప్టు మీద పని చేస్తున్నట్లు చెప్పాడు.ఈ సీక్వెల్ గురించి చాలా ఏళ్ల కిందటే వార్తలు వచ్చాయి. 'మున్నాభాయ్ ఛలే అమెరికా' పేరుతో సినిమా అనుకున్నారు. కానీ అది ముందుకు కదల్లేదు. ఐతే ఇటీవల 'మున్నాభాయ్-3' మీద హిరాని సీరియస్‌గా కనిపించడంతో ఆ సినిమా పట్టాలెక్కుతుందనే అనుకున్నారు. కానీ స్క్రిప్టు అనుకున్నంత బాగా రాలేదా.. లేక వేరేదైనా కారణాలున్నాయా తెలియదు కానీ.. హిరానీ ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టును పక్కన పెట్టేశాడని అంటున్నారు. ప్రస్తుతం ఆయన విక్రాంత్ మాసే, విక్కీ కౌశల్‌తో కలిసి ఒక వెబ్ సిరీస్ తీసే పనిలో పడ్డారు. ఇది పూర్తయ్యాక ఆమిర్ ఖాన్‌తో హిరాని జట్టు కట్టబోతున్నారట. 3 ఇడియట్స్, పీకే తర్వాత హ్యాట్రిక్ మూవీ మీద వీళ్లిద్దరూ పని చేయబోతున్నారట. తమ శైలికి తగ్గట్లే లైట్ హార్టెడ్ కామెడీ, ఎమోషనల్ టచ్ ఉన్న సబ్జెక్టుతో సినిమా చేయడానికి రెడీ అవుతున్నారట. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్ మీదికి వెళ్లొచ్చని సమాచారం. దీంతో 'మున్నాభాయ్-3'కి మరోసారి బ్రేక్ పడినట్లే అని.. ఇక ఆ సినిమా తెరకెక్కడం అనుమానమే అని బాలీవుడ్ వర్గాల సమాచారం.


## 'తమ్ముడు'కి ఎన్నెన్ని కష్టాలో..

నితిన్ కెరీర్లో చాలా కీలకమైన సినిమా.. తమ్ముడు. 'భీష్మ' తర్వాత నితిన్‌కు ఓ మోస్తరు హిట్ కూడా లేదు. చెక్, రంగ్ దె, మాచర్ల నియోజకవర్గం, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్.. ఇలా వరుసగా తన సినిమాలు నిరాశపరిచాయి. చివరి చిత్రం 'రాబిన్ హుడ్' అయినా మ్యాజిక్ చేస్తుందనుకుంటే అది మరో డిజాస్టర్ అయింది. దీంతో తర్వాతి చిత్రం 'తమ్ముడు' మీద చాలా ఆశలు పెట్టుకున్నాడతను. 'వకీల్ సాబ్' దర్శకుడు వేణు శ్రీరామ్ రూపొందిస్తున్న చిత్రమిది. ఈ సినిమా మేకింగ్ అనుకున్న దాని కంటే చాలా ఆలస్యం అయింది. బడ్జెట్ కూడా విపరీతంగా పెరిగిపోయింది. దీనికి తోడు ఈ చిత్రానికి సరైన రిలీజ్ డేటే కుదరట్లేదు. ముందేమో మహాశివరాత్రి అన్నారు. తర్వాత వేసవి రిలీజ్ అన్నారు. చివరికి జులై 4కు కొత్త డేట్ ప్రకటించారు. ఈసారి పక్కాగా ఆ డేట్‌కు రిలీజ్ చేస్తామని చెప్పుకున్నారు. ఇటీవలే రిలీజ్ డేట్ మీదే ఒక స్పెషల్ వీడియో కూడా చేసింది 'తమ్ముడు' టీం. రిలీజ్ మళ్లీ మళ్లీ వాయిదా పడుతుండడం.. ఏదో ఒక డేట్ ఫిక్స్ చేయకపోవడం మీద టీం తమ మీద తామే సెటైర్లు వేసుకుని చివరికి జులై 4న సినిమా రాబోతోందని ప్రకటించుకున్నారు. రెండు రోజుల ముందు కూడా 'తమ్ముడు' థీమ్ గురించి ఒక వీడియో రిలీజ్ చేసి అందులోనూ రిలీజ్ డేట్‌ను నొక్కి వక్కాణించారు. తీరా చూస్తే 'కింగ్ డమ్' కోసమని ఇప్పుడు 'తమ్ముడు'ను వాయిదా వేసుకున్నారు. ఇలాంటి సర్దుబాట్లు ఇండస్ట్రీలో మామూలే కానీ.. అసలే నితిన్ స్ట్రగుల్లో ఉంటే తన సినిమాకు ఇన్నిసార్లు రిలీజ్ డేట్ మార్చి, ఇంత ఆలస్యం చేస్తే అది సినిమాకు నెగెటివ్ అయ్యే ప్రమాదముంది. వీలైనంత త్వరగా కొత్త డేట్ ఎంచుకుని.. ఆ తేదీకైనా పక్కాగా సినిమాను రిలీజ్ చేస్తే బెటర్.

## 'ఆయ్' దర్శకుడి నెక్స్ట్ ఫిక్స్

గత ఏడాది చిన్న చిత్రాల్లో పెద్ద విజయం సాధించిన వాటిలో 'ఆయ్' ఒకటి. ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్‌ను హీరోగా పెట్టి అంజి అనే కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించాడు. గీతా ఆర్ట్స్ సంస్థ ఆగస్టు 15 వీకెండ్లో గట్టి పోటీ మధ్య ఈ చిత్రాన్ని విడుదల చేసి మంచి ఫలితం రాబట్టింది. పెద్ద సినిమాలను వెనక్కి నెట్టి ఈ చిత్రం బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచింది. దర్శకుడు అంజికి ఇది తొలి చిత్రమైనా.. నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్‌తో ప్రేక్షకులను అలరించి ఘనవిజయాన్నందుకున్నాడు. ఇప్పుడీ దర్శకుడు రెండో సినిమాకు రంగం సిద్ధం చేసుకున్నాడు.తొలి సినిమా చేసిన గీతా ఆర్ట్స్‌లోనే ఈ సినిమా కూడా తెరకెక్కనుంది. హీరోగా మంచి ఫామ్‌లో ఉన్న శ్రీ విష్ణు ఖరారయ్యాడట. ఈ క్రేజీ కాంబోలో సినిమా త్వరలోనే సెట్స్ మీదికి వెళ్లనుంది. శ్రీ విష్ణు ఇటీవలే 'సింగిల్'తో మంచి హిట్టు కొట్టాడు. కెరీర్ ఆరంభంలో సీరియస్ సినిమాలే చేసిన అతను.. ప్రస్తుతం ఎంటర్టైనర్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారాడు. 'సామజవరగమన', 'స్వాగ్', 'సింగిల్' చిత్రాలతో తన ఫాలోయింగ్ బాగా పెరిగింది. తన శైలికి.. అంజి స్టైల్‌కు బాగానే మ్యాచ్ అవుతుందని చెప్పొచ్చు. శ్రీ విష్ణుతో కూడా అంజి 'ఆయ్' తరహా ఎంటర్టైనర్ తీస్తే పెద్ద హిట్ అందుకోవడం ఖాయం. గోదావరి నేపథ్యంలో అక్కడి యాసతో సినిమా తీస్తే ఇద్దరికీ బాగా సూట్ అవుతుందని చెప్పొచ్చు. 'సింగిల్' మూవీతో విష్ణుకు, గీతా ఆర్ట్స్ సంస్థకు మంచి అనుబంధం ఏర్పడింది. గీతా సంస్థకు ఈ సినిమా మంచి లాభాలందించింది. ఈ సినిమాను వాళ్లు బాగా ప్రమోట్ చేసి, పెద్ద స్థాయిలో రిలీజ్ చేయడంతో విష్ణు రేంజ్ కూడా పెరిగింది. దీంతో మళ్లీ అతను హీరోగా సినిమా చేయడానికి ఒప్పందం కుదిరింది.





## రంగస్థలం కంటే గొప్పగా 'పెద్ది'

'పెద్ది' సినిమా రంగస్థలం కంటే గొప్పగా ఉండబోతుంది. ఆర్ఆర్ఆర్‌ను కూడా మించి ఉంటుంది. మామూలుగా అన్ని సినిమాలకు ఇలా చెప్పను. కానీ ఈసారి రాసిపెట్టుకోండి అని చెప్తున్నా. 30 శాతం షూటింగ్ పూర్తయ్యింది. మిగతా భాగం మరింత అద్భుతంగా ఉంటుంది' అని సినీ నటుడు రామ్‌చరణ్ అన్నారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న చిత్రం 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా చిత్రమిది. జాన్వీకపూర్ కథానాయిక. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది. లండన్‌లోని టుస్సాడ్స్ మ్యూజియంలో తన మైనపు విగ్రహావిష్కరణ కోసం రామ్‌చరణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల వెళ్లారు. రామ్‌చరణ్‌కు అక్కడ ఘన స్వాగతం లభించింది. అనంతరం ఫ్యాన్స్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. "పెద్ది' సినిమాకు సంబంధించిన అప్డేట్స్ పంచుకున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ఈ సినిమా. 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్ ఈ జోనర్‌లో చేస్తున్న సినిమా ఇదే. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, మీర్జాపూర్ మున్నా భయ్యా దివ్యేన్దు, జగపతిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎఆర్ రెహమాన్ సంగీతం. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట్ సతీష్ కిలారు భారీబడ్జెట్‌తో ఈ మూవీని నిర్మిస్తున్నారు.



## జులై 4కి 'కింగ్‌డమ్' వాయిదా

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కింగ్‌డమ్'. సితార ఎంటర్‌టైన్మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈనెల 30న విడుదల చేస్తామని మేకర్లు ప్రకటించారు. అనివార్యకారణాలతో జులై 4వ తేదీన సినిమాను విడుదల చేయబోతున్నామని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. 'మా ప్రియమైన ప్రేక్షకులకు, మే 30న విడుదల కావాల్సిన మా 'కింగ్‌డమ్' సినిమాను జూలై 4న విడుదల చేయనున్నామని తెలియజేస్తున్నాం. ముందుగా అనుకున్నట్టుగా మే 30వ తేదీకే సినిమాని తీసుకురావాలని ఎంతగానో ప్రయత్నించాం. కానీ, మన దేశంలో ఇటీవల ఊహించని సంఘటనలు జరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రమోషన్లులు, వేడుకలు నిర్వహించడం కష్టతరమని భావించి, ఈ నిర్ణయం తీసుకున్నాం. జూలై 4న థియేటర్లలో అడుగుపెడుతున్న ఈ చిత్రం, మీ ప్రేమను పొందుతుందని ఆశిస్తున్నాం.' అని చిత్ర బృందం పేర్కొంది. విజరు దేవరకొండ తన కెరీర్‌లో అత్యంత శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నారు. విజరుకి జోడిగా భాగ్యశ్రీ బోర్సే ఒక ఆసక్తికరమైన పాత్రలో కనిపించనున్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEE,TV.COM